www.udyamakeratam.com

RNI: TGTEL/25/A0273

1వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షితః

UDYAMA KERATAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | సంపుటి: 2 | సంచిక: 70 | 22-8-2026 | శనివారం | పేజీలు: 8 | వెల : రూ.2/-

## చక్కెర ధరలపై కేంద్రం వివరణ

- బీహార్ మంత్రి వింత వ్యాఖ్యలు
- ఇథనాల్ ఉత్పత్తితో ధరలకు సంబంధం లేదన్న కేంద్రం
- డయాబెటిస్ వల్ల పంచదార వినియోగం తగ్గిందన్న బీహార్ మంత్రి శ్రావణ్ కుమార్

4




## జ్యుడీషియల్ సర్వీస్‌కు ప్రాక్టీస్ ఏడాదే

- సుప్రీంకోర్టు కీలక నిర్ణయం
- సివిల్ జడ్జి పోస్టులకు మూడేళ్ల అనుభవ నిబంధన సవరణ
- 2027 మార్చి వరకు లా గ్రాడ్యుయేట్లకు అనుభవంతో సంబంధం లేకుండా మినహాయింపు

4






## ఆక్స్‌ఫర్డ్‌లో సీఎం రేవంత్


- 900 ఏళ్ల చరిత్ర కలిగిన వర్సిటీ సందర్శన
- బ్లావాట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌లో పర్యటన
- ప్రముఖ ప్రొఫెసర్లతో తెలంగాణ బృందం భేటీ
- ఆక్స్‌ఫర్డ్‌తో భారత్ అనుబంధంపై చర్చ

2

## రాయదుర్గం భూముల వేలానికి లైన్ క్లియర్

- జోక్యానికి సుప్రీంకోర్టు నిరాకరణ
- పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం
- హైకోర్టులోనే తేల్చుకోవాలని సూచన
- 11 ఎకరాల వేలానికి తొలగిన అడ్డంకి
- ఎకరాకు కనీస ధర రూ.175 కోట్లు

2



ఎకరం 264 కోట్లు

2

# ఎల్‌నినోను ఎదుర్కొందాం.. రైతును నిలబెడదాం

- అక్టోబర్, నవంబర్ అత్యంత కీలకం
- పంట చేతికొచ్చే వేళ నీటి కొరత రానివ్వొద్దు
- భూగర్భ జలాల వినియోగంపై పక్కా ప్రణాళిక
- 44 వేల చెరువుల్లో నీటి నిల్వకు చర్యలు
- అన్ని శాఖల సమన్వయంతో రైతుకు భరోసా
- వర్క్‌షాప్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

### సవాళ్లను అవకాశాలుగా మార్చుకోవాలి



ఎల్‌నినో ప్రభావంతో రాబోయే వర్షాభావ పరిస్థితులను, నీటి ఎద్దడిని ముందస్తుగా గుర్తించి రాష్ట్ర రైతాంగాన్ని అన్ని విధాలా సన్నద్ధం చేయాలని పలువురు రాష్ట్ర మంత్రులు అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో అనేది సాధారణ పరిస్థితి కాదని, ముఖ్యంగా అక్టోబర్, నవంబర్ నెలల్లో పంటలు చేతికొచ్చే కీలక సమయంలో నీటి కొరత తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (టీజీఐఆర్డీ) వేదికగా 'ఎల్‌నినో ఎదుర్కొనేందుకు సమగ్ర సమీకృత వ్యవసాయ కుంటల పాత్ర' అనే అంశంపై శుక్రవారం రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి సీతక్క పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

*- హైదరాబాద్, ఆగస్టు 21*




## చెప్పాల్సింది చెప్పేశా..

సీఎం రేవంత్ విదేశీ పర్యటన నుంచి వచ్చాక స్పందిస్తా

కుమార్తె సుస్మిత వ్యాఖ్యలు వ్యక్తిగతమేనన్న కొండా సురేఖ

3



## పెల్లెట్ బాధితుడి కోసం రాహుల్ భైఠాయింపు

- ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ డిమాండ్
- బాధితుడు సాహిల్‌తో రాణాకు రాహుల్
- కేసు నమోదుకు పోలీసులు నిరాకరించారంటూ నిరసన

4



## ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసు

- హైకోర్టులో ముగిసిన వాదనలు
- సెప్టెంబర్ 16న తీర్పు వెలవరించనున్న హైకోర్టు

2

ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల వ్యవహారంపై దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. ఎమ్మెల్యేల అనర్హతపై హైకోర్టులో ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. దీంతో సెప్టెంబర్ 16న తీర్పును వెల్లడించనున్నట్లు న్యాయస్థానం తెలిపింది.



## రాజకీయ పర్యటనలకు ప్రాధాన్యం ఇవ్వం

- అందుకే సీఎం రేవంత్ పర్యటనకు అనుమతి నిరాకరణ
- విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వివరణ

2

## ప్రపంచ పెట్టుబడులే లక్ష్యం..

- తెలంగాణ రైజింగ్‌కు భారీ సన్నాహాలు
- డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ' గ్లోబల్ సమ్మిట్
- తెలంగాణ సామర్థ్యాన్ని చాటే రంగాల వారీగా ప్రదర్శనలు
- పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సీఎస్ సంజయ్ జాజు ఆదేశం

2



## రాష్ట్రంలో ఇల్లు లేని పేద ఉండొద్దు



3

అసంపూర్తి గృహాలనూ పూర్తి చేసి నిరుపేదలకు అందిస్తాం

నూకలపల్లి 5,400 ఇళ్లకు రూ.32 కోట్లతో మౌలిక వసతులు

కాలనీకి పాఠశాల, ఆసుపత్రి, చర్చి, మసీదు మంజూరుకు హామీ

అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు: మంత్రి పొంగులేటి



## కల్తీకల్లు మాఫియాపై ఉక్కుపాదం

- మూడు రాష్ట్రాలకు విస్తరించిన ఆల్ప్రాజోలం దందా గుట్టురట్టు
- రూ.6 కోట్ల విలువైన అక్రమ ఆస్తుల జప్తు
- 15 మంది కీలక నిందితులు అదుపులో..

3

## ప్రయాణికులకు ఆర్టీసీ ఆఫర్

రిటర్న్ టికెట్ బుకింగ్‌పై పదిశాతం రాయితీ




2

ప్రయాణికులకు ఆర్టీసీ ప్రత్యేకమైన ఆఫర్‌ను అందుబాటులోకి తెచ్చింది. రిటర్న్ టికెట్ బుకింగ్‌పై పదిశాతం రాయితీ కల్పించింది.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
శనివారం
22 ఆగస్టు 2026



# ఆక్స్‌ఫర్డ్‌లో సీఎం రేవంత్

**900 ఏళ్ల చరిత్ర కలిగిన వర్సిటీ సందర్శన**

**బ్లావాట్‌నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌లో పర్యటన**

**ప్రముఖ ప్రొఫెసర్లతో తెలంగాణ బృందం భేటీ**

**బ్రిటన్, ఆగస్టు 21:** లండన్ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రపంచంలోని అత్యంత పురాతన, ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ఒకటైన ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయాన్ని శుక్రవారం సందర్శించారు. రాష్ట్ర ప్రతినిధి బృందంతో కలిసి విశ్వవిద్యాలయంలోని పలు విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం పరిధిలోని బ్లావాట్‌నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను సీఎం సందర్శించారు. పాలన, ప్రజా విధానాలపై అధ్యయనం, పరిశోధనలకు అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ఈ విద్యాసంస్థలోని అధ్యాపకులతో తెలంగాణ ప్రతినిధి బృందం సమావేశమైంది. ప్రొఫెసర్ మాయా ట్యూడర్, ప్రొఫెసర్ ఫైసల్ దేవ్జీ తెలంగాణ బృందాన్ని కలుసుకున్నారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో పర్యటించిన సందర్భంగా ఆక్స్‌ఫర్డ్‌కు భారతదేశంతో ఉన్న చారిత్రక అనుబంధాన్ని కూడా గుర్తు చేసుకున్నారు. ఇందిరా గాంధీ ఆక్స్‌ఫర్డ్‌లో విద్యాభ్యాసం చేసిన విషయాన్ని ప్రస్తావించారు. దాదాపు తొమ్మిది శతాబ్దాల చరిత్ర కలిగిన ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయాన్ని సీఎం సందర్శించడం ఆయన బ్రిటన్ పర్యటనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సీఎం వెంట రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# మహిళలకు సీఎం శుభాకాంక్షలు

**హైదరాబాద్, ఆగస్ట్ 21:** మంగళకరమైన శ్రావణ శుక్రవారం, సకల సౌభాగ్యాలను ప్రసాదించే శ్రీ వరలక్ష్మి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించే శుభదినం సందర్భంగా సీఎందరేవంత్ రెడ్డి ప్రజలందరికీ శ్రీ వరలక్ష్మి ప్రతి మహోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీవరలక్ష్మి దేవి అమ్మవారి కరుణాకటాక్షాలతో ప్రతి ఇంటా సుఖశాంతులు, సిరిసంపదలు, ఆయురారోగ్యాలు, ఆనందాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

**సావుకారు జానకికి సెం రేవంత్ సంతాపం**

ప్రముఖ నటి, పద్మశ్రీ షావుకారు జానకి మరణించారని తెలిసి సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. చిన్నతనం నుంచే నాటకాల్లో వివిధ పాత్రలు పోషిస్తూ కెరీర్‌ను ప్రారంభించిన షావుకారు జానకి గారు దాదాపు ఏడు దశాబ్దాల పాటు చలనచిత్ర రంగంలో తనదైన ముద్ర వేశారని అన్నారు. 'షావుకారు' సినిమాలో అసమాన ప్రతిభ కనబరిచి షావుకారు జానకిగా స్థిరపడ్డారని గుర్తుచేస్తూ, తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో దాదాపు 400 చిత్రాల్లోనే కాకుండా హిందీ, మలయాళ చిత్రాల్లో కూడా నటించి ప్రేక్షకులను మెప్పించారని అన్నారు. పలు మేటి చిత్రాల్లో షావుకారు జానకి పోషించిన పాత్రలు ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తాయని కొనియాడారు. చలనచిత్ర రంగంలో ఆమె లేని లోటు పూడ్చలేనిదని అన్నారు. భగవంతుడు ఆమెకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ, అమె కుటుంబ సభ్యులకు సీఎం సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసు

**16న తీర్పు వెలవరించనున్న హైకోర్టు**

**హైదరాబాద్, ఆగస్ట్ 21:** తెలంగాణలో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల వ్యవహారంపై దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. ఎమ్మెల్యేల అనర్హతపై హైకోర్టులో ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. దీంతో సెప్టెంబర్ 16న తీర్పును వెల్లడించనున్నట్లు న్యాయస్థానం తెలిపింది. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ తరఫు న్యాయవాదులు హైకోర్టులో వాదనలు వినిపించారు. కాంగ్రెస్‌కు అనుకూలంగా ఆయా ఎమ్మెల్యేలు ప్రచారం చేసిన వీడియోలను న్యాయస్థానానికి సమర్పించారు. అభివృద్ధి కోసం మాత్రమే ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నామని ఫిరాయింపు ఎమ్మెల్యేలు అంటున్నారని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది గండ్ర మోహన్ రావు కోర్టుకు తెలియజేశారు. ఏఐసీసీ అధికారిక కార్యక్రమాల్లో ఫిరాయింపు ఎమ్మెల్యేలు పాల్గొన్నారని, వీరి వీడియోలు ఆంధ్రజ్యోతిలో ప్రసారం అయ్యాయని తెలిపారు. ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుని.. జాతీయ జెండాగా చెబుతున్నారని, జాతీయ జెండాలో అశోక చక్రం ఉంటుందని గండ్ర మోహన్ రావు.. కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే దానం నాగేందర్.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఎన్నికై, ఎమ్మెల్యే పదవిలో కొనసాగుతూనే కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీగా పోటీ చేశారని కోర్టుకు వివరించారు. పార్టీ సభ్యత్వం లేని వ్యక్తులకు ఎన్నికల్లో టికెట్ ఇవ్వడం సాధ్యం కాదని అన్నారు. ప్రధాన పత్రికలు, టీవీ ఛానళ్లలో ప్రసారమైన వార్తా కథనాలు, వీడియోలను కూడా బీఆర్ఎస్ తరఫు న్యాయవాది గండ్ర మోహన్ రావు న్యాయస్థానం ముందు ఉంచారు. ఇరుపక్షాల వాదనలు పూర్తవడంతో సెప్టెంబర్ 16న తీర్పును వెల్లడించనున్నట్లు హైకోర్టు పేర్కొంది.

# ప్రయాణికులకు ఆర్టీసీ ఆఫర్

**రిటర్న్ టికెట్ బుకింగ్‌పై పదిశాతం రాయితీ**

**హైదరాబాద్, ఆగస్ట్ 21:** ప్రయాణికులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రత్యేక ఆఫర్ ప్రకటించింది. రాకపోకల టికెట్లను ఒకేసారి ముందస్తుగా రిజర్వేషన్ చేసుకునే ప్రయాణికులకు తిరుగు ప్రయాణ టికెట్‌పై 10 శాతం రాయితీ కల్పిస్తోంది. ప్రయాణ ఖర్చును తగ్గించడంతో పాటు ముందస్తు రిజర్వేషన్లను ప్రోత్సహించేందుకు ఈ అవకాశం కల్పించినట్లు సంస్థ తెలిపింది. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో పాటు వారాంతాలు, పండుగలు, సెలవుల్లో కుటుంబాలతో ప్రయాణించే వారికి ఈ రాయితీ ప్రయోజనకరంగా ఉండనుంది. వెళ్లే ప్రయాణంతోపాటు తిరుగు ప్రయాణానికి కూడా ఒకేసారి టికెట్లు రిజర్వేషన్ చేసుకున్నప్పుడే 10 శాతం రాయితీ వర్తిస్తుంది. ప్రయాణికులు ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్ ద్వారా ముందస్తుగా టికెట్లు బుక్ చేసుకోవచ్చు. ప్రయాణ తేదీలను ముందుగానే ఖరారు చేసుకునే వారికి రాయితీతో పాటు కోరుకున్న బస్సులో సీటు పొందే అవకాశం కూడా ఉంటుందని సంస్థ పేర్కొంది. రాబోయే పండుగలు, సెలవుల సీజన్‌లో ప్రయాణికుల రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున చివరి నిమిషంలో ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందుగానే రాకపోకల టికెట్లు బుక్ చేసుకోవాలని సూచించింది. దీనివల్ల సీట్ల లభ్యతపై ఆందోళన తగ్గడంతో పాటు తిరుగు ప్రయాణ ఛార్జీలో 10 శాతం ఆదా చేసుకోవచ్చని తెలిపింది. టికెట్ల బుకింగ్‌కు సంబంధించిన సందేహాలు, ఇతర సమాచారం కోసం 040-69440000, 040-23450033 నంబర్లను సంప్రదించవచ్చని ఆర్టీసీ తెలిపింది. సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రజా రవాణా సేవలను వినియోగించుకోవడంతో పాటు రిటర్న్ టికెట్ రాయితీని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరింది.

# ఎల్‌నినోను ఎదుర్కొందాం.. రైతును నిలబెడదాం

- సవాళ్లను అవకాశాలుగా మార్చుకోవాలి
- అక్టోబర్, నవంబర్ అత్యంత కీలకం
- పంట చేతికొచ్చే వేళ నీటి కొరత రానివ్వొద్దు
- భూగర్భ జలాల వినియోగంపై పక్కా ప్రణాళిక
- 44 వేల చెరువుల్లో నీటి నిల్వకు చర్యలు
- అన్ని శాఖల సమన్వయంతో రైతుకు భరోసా
- వర్క్‌షాప్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్, ఆగస్టు 21:** ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే సవాళ్లను ముందుగానే అంచనా వేసి తెలంగాణను అన్ని విధాలుగా సన్నద్ధం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఎల్‌నినోను సాధారణ పరిస్థితిగా తీసుకోవద్దని, ముఖ్యంగా అక్టోబర్, నవంబర్ నెలల్లో పంటలు చేతికొచ్చే సమయంలో నీటి కొరత తలెత్తకుండా ఇప్పటి నుంచే పక్కా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అందుబాటులో ఉన్న ప్రతి నీటి చుక్కను జాగ్రత్తగా వినియోగిస్తూ రైతాంగాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. రాజేంద్రనగర్‌లో శుక్రవారం ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కోవడంలో సమీకృత వ్యవసాయ కుంటల పాత్రపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో తుమ్మల నాగేశ్వరరావుతో పాటు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వ్యవసాయ, పశుసంవర్ధక, పంచాయతీరాజ్ శాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రస్తుతం భూగర్భ జలాలు గణనీయంగా పెరిగే స్థాయిలో వర్షపాతం నమోదు కాలేదని, ప్రధాన జలాశయాల్లోకి కూడా ఆశించిన స్థాయిలో నీరు చేరలేదని తుమ్మల పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో అందుబాటులో ఉండే భూగర్భ జలాలను ఎప్పటికప్పుడు అంచనా వేసి, వాటిని పొదుపుగా వినియోగించేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆటో స్టార్టర్లతో రేయింబవళ్లు మోటార్లు నడిపి భూగర్భ జలాలను వృథా చేయకుండా పంటకు అవసరమైన మేరకే నీటిని వినియోగించేలా చూడాలన్నారు.

**44 వేల చెరువులే ఆయుధం**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 44 వేల చెరువులను సమర్థంగా వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. వర్షపు నీరు చెరువుల్లోకి చేరే మార్గాలను పునరుద్ధరించి సాధ్యమైనంత ఎక్కువ నీటిని నిల్వ చేయాలన్నారు. చెరువుల్లో నీరు నిలిస్తే పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం పెరిగి బోర్లకు నీరు అందే అవకాశం ఉంటుందని వివరించారు. వాగులు, నదుల్లో అవసరమైన ప్రాంతాల్లో ట్రెంచ్‌లు, రాక్‌ఫిల్ డ్యామ్‌లు ఏర్పాటు చేసి నీరు భూమిలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

**ప్రతి గ్రామానికి 'నీటి బడ్జెట్'**

జిల్లా స్థాయిలో అధికారులు నిరంతరం సమన్వయ సమావేశాలు నిర్వహించి ఆయా ప్రాంతాల్లో నీటి లభ్యత, పంటల పరిస్థితిపై స్పష్టమైన ప్రణాళిక రూపొందించుకోవాలని తుమ్మల ఆదేశించారు. మండల, జిల్లా స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రైతులకు నమ్మకమైన మార్గదర్శకత్వం అందించాలన్నారు. ప్రజలతో అధికారులు మానవీయ కోణంలో వ్యవహరించాలని సూచించారు. ఒకే పంటపై ఆధారపడే పరిస్థితి నుంచి రైతులను బయటకు తీసుకురావాలని మంత్రి పేర్కొన్నారు. పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించడం ద్వారా మార్కెట్‌లో ధరలు హెచ్చుతగ్గులకు గురైనా రైతుకు నష్టం తగ్గించవచ్చన్నారు. ఉద్యాన పంటలతో పాటు ఆయిల్‌పామ్ సాగును విస్తరించాలని, ఆయిల్‌పామ్‌లో కోకో, వక్క, మిరియాలు వంటి అంతర పంటలను ప్రోత్సహించడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం కల్పించవచ్చని చెప్పారు.

**పశువులు.. వన్యప్రాణులకూ నీరు**

కరువు పరిస్థితులు ఎదురైతే మనుషులతో పాటు పశువులు, వన్యప్రాణులకు కూడా నీటి కొరత రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు. గతంలో కరువు సమయంలో గ్రామాల వెలుపల పశువుల కోసం నీటి తొట్లు ఏర్పాటు చేసిన విధంగానే అవసరమైతే అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులకు నీటి సదుపాయాలు కల్పించాలని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాలను కేవలం సవాళ్లుగా చూడకుండా అవకాశాలుగా మార్చుకోవాలని తుమ్మల పిలుపునిచ్చారు. కొత్త సాంకేతికత కోసమే ఎదురుచూడకుండా పూర్వీకులు అనుసరించిన సంప్రదాయ నీటి సంరక్షణ పద్ధతులను కూడా తిరిగి అమల్లోకి తీసుకురావాలన్నారు. వ్యవసాయం, పశుసంవర్ధక, మత్స్య, అటవీ, పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖలు సమష్టిగా పనిచేస్తే ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవచ్చని పేర్కొన్నారు. "ఎల్‌నినో కాదు.. ఎల్‌నినో తాత వచ్చినా తెలంగాణ రైతును నిలబెట్టగలిగే శక్తి మనకు ఉండాలి. ప్రతి గ్రామానికి నీటి బడ్జెట్.. ప్రతి రైతుకు నీటి భద్రత.. ప్రతి ఎకరానికి వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యం కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగాలి" అని తుమ్మల పిలుపునిచ్చారు.

# రాయదుర్గం భూముల వేలానికి లైన్ క్లియర్

- జోక్యానికి సుప్రీంకోర్టు నిరాకరణ
- పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం
- హైకోర్టులోనే తేల్చుకోవాలని సూచన
- 11 ఎకరాల వేలానికి తొలగిన అడ్డంకి
- ఎకరాకు కనీస ధర రూ.175 కోట్లు



**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** రాయదుర్గం పాన్‌మక్తా భూముల వేలం ప్రక్రియకు ఉన్న న్యాయపరమైన అడ్డంకి తొలగింది. టీజీఐఐసీ చేపట్టిన భూముల వేలంలో జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. వేలం ప్రక్రియను సవాలు చేస్తూ జువ్వాడి ప్రణయ్ సింహారావు దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. అభ్యంతరాలు ఉంటే హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ మేరకు స్పష్టం చేసింది. ధర్మాసనంలో జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ మోహన్ ఉన్నారు. సుప్రీంకోర్టు నిర్ణయంతో రాయదుర్గం పాన్‌మక్తా భూముల వేలాన్ని కొనసాగించేందుకు టీజీఐఐసీకి మార్గం సుగమమైంది. రాయదుర్గం పాన్‌మక్తా ప్రాంతంలోని రెండు సర్వే నంబర్ల పరిధిలో ఉన్న సుమారు 11 ఎకరాల భూముల విక్రయానికి టీజీఐఐసీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఒక్కో ఎకరానికి రూ.175 కోట్ల కనీస ధరను నిర్ణయించింది. ఈ వేలాన్ని సవాలు చేస్తూ ప్రణయ్ సింహారావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గతంలో కంచ గచ్చిబౌలి భూముల విషయంలో సుప్రీంకోర్టు స్టే ఇచ్చిందని, రక్షించాల్సిన భూములనే ఇప్పుడు వేలం వేస్తున్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది నీరజ్ కిషన్ కౌల్ వాదించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. పిటిషనర్ కోర్టును తప్పుదారి పట్టిస్తున్నారని ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదించారు. కంచ గచ్చిబౌలి భూములకు, ప్రస్తుతం వేలం వేస్తున్న రాయదుర్గం పాన్‌మక్తా భూములకు ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. రెండు ప్రాంతాలు సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు టీజీఐఐసీ వేలం నోటిఫికేషన్‌లో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. ఈ వ్యవహారంలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే హైకోర్టులోనే తేల్చుకోవాలని సూచిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో కోట్లాది రూపాయల విలువైన రాయదుర్గం భూముల వేలానికి కీలక న్యాయపరమైన అడ్డంకి తొలగినట్లయింది.

## ఎకరం 264 కోట్లు

**రాయదుర్గం భూములకు రికార్డు ధర**

**హైదరాబాబాద్, ఆగస్ట్ 21:** నగరంలోని రాయదుర్గంలో ఎకరం భూమి రికార్డు ధర పలికింది. పాన్‌మక్తాలో సర్వే నంబర్ 83/1లోని 5.25 ఎకరాల భూమికి టీజీఐఐసీ శుక్రవారం వేలం నిర్వహించింది. ఈ వేలంలో ఎకరా రూ.264 కోట్లకు అమ్ముడుపోయింది. ఎంఎస్ఎన్ రియాలిటీ సంస్థ అధిక ధర చెల్లించి ఈ భూమిని సొంతం చేసుకుంది. మొత్తం 5.25 ఎకరాలనూ ఆ సంస్థే దక్కించుకుంది. ఇదే సర్వే నంబర్‌లో మే నెలలో నిర్వహించిన వేలంలో ఎకరా రూ.237 కోట్లు పలికింది. వేలంలో కనీస ధర రూ.175 కోట్లు, డిపాజిట్ రూ.10కోట్లుగా టీజీఐఐసీ నిర్ణయించింది. బిడ్డర్లు డిపాజిట్ చెల్లించి ఆన్‌లైన్ వేలంలో పాల్గొన్నారు. ఖరీదైన భూమి కావడంతో స్థిరాస్తి సంస్థలు పోటీపడి బిడ్డింగ్ దాఖలు చేశాయి. చివరికి ఎంఎస్ఎన్ సంస్థ అధిక ధర చెల్లించి ఈ భూమిని దక్కించుకుంది.

# రాజకీయ పర్యటనలకు ప్రాధాన్యం ఇవ్వం

**అందుకే సీఎం రేవంత్ పర్యటనకు అనుమతి నిరాకరణ.. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వివరణ**



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 21:** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వలేదు. దీనిపై విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పందించింది. శుక్రవారం న్యూఢిల్లీలో ఆ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వివరణ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి బ్రిటన్ పర్యటనకు కేంద్రం క్లియరెన్స్ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే సీఎంలు, ఇతర ప్రముఖుల పర్యటనలను.. రాజకీయ క్లియరెన్స్ కోసం అంచనా వేస్తామని ఆయన వివరించారు. ప్రతిపాదిత కార్యక్రమం పదవికి, పర్యటన ఉద్దేశానికి అనుగుణంగా ఉండాలని ఈ సందర్భంగా జైస్వాల్ స్పష్టం చేశారు. అమెరికా పర్యటన అంశంలో అలా లేదన్నారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి యూఎస్ పర్యటనకు క్లియరెన్స్ నిరాకరించామని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. 10 రోజుల విదేశీ పర్యటన కోసం సీఎం రేవంత్ రెడ్డి లండన్‌కు బయలుదేరి వెళ్లారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం కోసం న్యూఢిల్లీ వెళ్లిన ఆయన బుధవారం అర్ధరాత్రి తర్వాత అక్కడి నుంచి బయలుదేరి విదేశాలకు వెళ్లారు. ముందుగా అనుకున్న ప్రకారం.. ఆగస్టు 30వ తేదీ వరకు బ్రిటన్, అమెరికాల్లో సీఎం బృందం పర్యటించ నుంది. ఈ రెండు దేశాల్లోని వివిధ యూనివర్సిటీలను సందర్శించి తెలంగాణలో ఉన్నత విద్య, క్రీడల అభివృద్ధిపై ఈ బృందం చర్చించనుంది. అలాగే లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలోని బ్లావట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను సీఎం బృందం సందర్శించనుంది. అక్కడి ఎమిరేట్స్ స్టేడియంలో ఫుట్‌బాల్ ప్రజెంటేషన్‌లో పాల్గొనుంది. అనంతరం యూఎస్‌కు సీఎం బృందం బయలుదేరి వెళ్లాల్సి ఉంది. కానీ సీఎం రేవంత్ అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వ లేదు. దాంతో ఆయన లండన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. అయితే యూఎస్ పర్యటనకు వెళ్లాలని అధికారుల బృందాన్ని సీఎం రేవంత్ ఆదేశించినట్లు తెలుస్తోంది.

# చక్కెర ధరల పెరుగుదలపై కేంద్రం వివరణ

**ఇథనాల్ ఉత్పత్తితో ధరలకు సంబంధం లేదన్న కేంద్రం**

**న్యూఢిల్లీ:** దేశంలో ఇటీవల చక్కెర ధరలు పెరగడంపై కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ స్పందించింది. పెట్రోల్‌లో కలిపే ఇథనాల్ తయారీకి చక్కెరను మళ్లించడం వల్లే ధరలు పెరిగాయన్న విపక్షాల ఆరోపణలను కేంద్రం తోసిపుచ్చింది. స్థానికంగా అంచనాల కంటే తక్కువ దిగుబడి రావడం, పండుగల డిమాండ్, అంతర్జాతీయ సరఫరాల్లో అంతరాయం, కొంతమంది నిల్వలు పెంచడం వల్లే ధరలు పెరిగాయని స్పష్టం చేసింది. 2022-23లో ఇథనాల్ కోసం మళ్లించిన చక్కెర వాటా 12 శాతంగా ఉండగా, 2025-26 నాటికి అది 9 శాతానికి తగ్గిందని, దేశంలో ఉత్పత్తి అయ్యే ఇథనాల్‌లో ఎక్కువ భాగం మొక్కజొన్న వంటి ధాన్యాల నుంచే వస్తోందని తెలిపింది. జులై 20న కిలో రూ.48.18గా ఉన్న ధర, ఆగస్టు 20 నాటికి రూ.55.70కి చేరడంతో నిల్వలపై పరిమితులు విధించడంతో పాటు దిగుమతి సుంకాలు తగ్గించినట్లు పేర్కొంది. మరోవైపు చక్కెర ధరల పెరుగుదలపై బీహార్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రావణ్ కుమార్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. నేటిరోజుల్లో అందరికీ డయాబెటిస్, ప్రీ-డయాబెటిక్ సమస్యలు ఉన్నాయని, ప్రజలు తీపి పదార్థాలను సరిగా తినడం లేదు కాబట్టి చక్కెర ధర పెరిగినా ప్రజలపై పెద్దగా ప్రభావం ఉండదని ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లతో పాటు ప్రతిపక్ష ఆర్జేడీ తీవ్రస్థాయిలో మండిపడింది. ఉదయాన్నే కప్పు టీతో దినచర్య ప్రారంభించే సామాన్య ప్రజలపై ఈ ధరల భారం తీవ్రంగా పడిందని, మంత్రి హోదాలో ఉన్న శ్రావణ్ కుమార్ బాధ్యతారాహిత్యంగా మాట్లాడటం సరికాదని ఆర్జేడీ ప్రతినిధి ఎజాజ్ అహ్మద్ విమర్శించారు.

# ప్రపంచ పెట్టుబడులే లక్ష్యం..

- తెలంగాణ రైజింగ్‌కు భారీ సన్నాహాలు
- డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్' గ్లోబల్ సమ్మిట్
- విదేశీ రాయబారులు, హైకమిషనర్లకు ప్రత్యేక ఆహ్వానాలు
- ప్రపంచ దిగ్గజ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులపై దృష్టి
- తెలంగాణ సామర్థ్యాన్ని చాటే రంగాల వారీగా ప్రదర్శనలు
- పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు సీఎస్ సంజయ్ జాజు ఆదేశం



**హైదరాబాద్, ఆగస్టు 21:** ప్రపంచ పెట్టుబడులను తెలంగాణ వైపు ఆకర్షించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్-ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు భారీ సన్నాహాలు ప్రారంభమయ్యాయి. డిసెంబర్‌లో హైదరాబాద్ వేదికగా జరిగే ఈ అంతర్జాతీయ సదస్సును అత్యున్నత ప్రమాణాలతో నిర్వహించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సంజయ్ జాజు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సమ్మిట్‌కు హాజరయ్యే అతిథులు, పెట్టుబడిదారులు, పారిశ్రామిక సంస్థలు, వివిధ రంగాల ప్రముఖులతో పాటు నిర్వహణకు సంబంధించిన అంశాలపై అధికారులతో చర్చించారు. వివిధ దేశాల రాయబారులు, హైకమిషనర్లకు ప్రత్యేక ఆహ్వానాలు పంపాలని సీఎస్ సూచించారు. ఆయా దేశాల్లోని ప్రముఖ పారిశ్రామికవేత్తలు, అంతర్జాతీయ పెట్టుబడిదారులను సమ్మిట్‌కు రప్పించేందుకు ముందస్తు కార్యాచరణ చేపట్టాలన్నారు. దేశంలోని ప్రముఖ పారిశ్రామిక సంస్థల ప్రతినిధులతో పాటు శాస్త్రసాంకేతిక, వైద్య, విద్య, మౌలిక వసతులు తదితర రంగాలకు చెందిన ప్రముఖులను భాగస్వాములను చేయాలని సూచించారు.

### తెలంగాణ సత్తా ప్రపంచానికి చాటాలి

పరిశ్రమలు, సమాచార సాంకేతికత, జీవశాస్త్రాలు, వైద్యం, విద్య, మౌలిక వసతులు సహా తెలంగాణలోని వివిధ రంగాల సామర్థ్యం, పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేసేలా ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సంజయ్ జాజు ఆదేశించారు. ఆయా ప్రదర్శనల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రముఖ కంపెనీలు, సంస్థలు భాగస్వాములయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు.

### ప్రత్యేక కమిటీలతో పర్యవేక్షణ

సమ్మిట్ నిర్వహణలో ఎక్కడా లోటుపాట్లు తలెత్తకుండా వివిధ కమిటీలను ఏర్పాటు చేయాలని సీఎస్ సూచించారు. ప్రతి కమిటీకి స్పష్టమైన బాధ్యతలు అప్పగించి, అన్ని విభాగాల మధ్య సమన్వయం ఉండేలా చూడాలన్నారు. ఏర్పాట్ల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. అంతర్జాతీయ సమ్మిట్‌కు మార్గదర్శకత్వం అందించేందుకు పరిశ్రమలు, పెట్టుబడులు, సాంకేతికత తదితర రంగాలకు చెందిన ప్రముఖులు, నిపుణులతో ప్రత్యేక సలహా మండలిని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణను ప్రపంచస్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా మరింత బలంగా ఆవిష్కరించే వేదికగా ఈ సమ్మిట్‌ను తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. సమావేశంలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ అజిత్‌రెడ్డి, పరిశ్రమల డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# కల్తీకల్లు మాఫియాపై ఉక్కుపాదం

- మూడు రాష్ట్రాలకు విస్తరించిన ఆల్ప్రాజోలం దందా గుట్టురట్టు
- రూ.6 కోట్ల విలువైన అక్రమ ఆస్తుల జప్తు
- 32.5 కిలోల ఆల్ప్రాజోలం స్వాధీనం
- మహారాష్ట్రలో కెమికల్ ఫ్యాక్టరీపై మెరుపుదాడి
- 15 మంది కీలక నిందితులు అదుపులో



**హైదరాబాద్, ఆగస్టు 21:** తెలంగాణలో కల్తీకల్లు తయారీకి ఆల్ప్రాజోలం సరఫరా చేస్తున్న భారీ అంతర్రాష్ట్ర ముఠాపై తెలంగాణ ఈగల్ ఫోర్స్, బోధన్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు విస్తరించిన నెట్‌వర్క్‌ను ఛేదించడంతో పాటు అక్రమ వ్యాపారంతో కూడబెట్టిన సుమారు రూ.6 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేశారు. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు 15 మంది కీలక నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మాదకద్రవ్యాల వ్యాపారం ద్వారా వచ్చిన సొమ్ముతో సమకూర్చుకున్న ఆస్తులపై ఎన్డీపీఎస్ చట్టం సెక్షన్ 68(ఈ) ప్రకారం అధికారులు చర్యలు చేపట్టారు. నిందితులకు చెందిన 9.06 ఎకరాల వ్యవసాయ భూమి, 1,370 చదరపు గజాల ప్లాట్లు, అక్రమ రవాణాకు ఉపయోగించిన వాహనాలతో పాటు మహారాష్ట్రలోని కెమికల్ ఫ్యాక్టరీని జప్తు చేశారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం వీటి విలువ రూ.2.5 కోట్లు కాగా, బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.6 కోట్ల వరకు ఉంటుందని అంచనా.

### కల్తీకల్లు ఘటనలతో కదిలిన డొంక

ఉమ్మడి నిజామాబాద్, మెదక్, సిద్ధిపేట జిల్లాల్లో కల్తీకల్లు తయారీకి ఆల్ప్రాజోలం వినియోగిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. నస్రుల్లాబాద్‌లో కల్తీకల్లు తాగి 68 మంది, గాంధారి ప్రాంతంలో మరో 15మంది తీవ్ర అస్వస్థతకు గురికావడంతో పోలీసులు నెట్‌వర్క్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. సిద్ధిపేటలో కల్తీకల్లుకు సంబంధించి మూడు కేసులు నమోదయ్యాయి. జహీరాబాద్‌లో నిఘా పెట్టిన అధికారులు 750గ్రాముల ఆల్ప్రాజోలం, 7.50లక్షల నగదు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో లభించిన ఆధారాలతో దర్యాప్తును మరింత విస్తరించారు.

### బోధన్‌లో దొరికిన తీగ.. మహారాష్ట్రలో కదిలిన డొంక

బోధన్ పరిధిలో నిర్వహించిన మెరుపుదాడిలో రూ.25 లక్షల విలువైన 2.5 కిలోల ఆల్ప్రాజోలం, ఒక కారు, రూ.25 లక్షల నగదు, ఎనిమిది మొబైల్ ఫోన్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అక్కడ లభించిన కీలక ఆధారాలతో దర్యాప్తు బృందాలు మహారాష్ట్రలోని సతారా జిల్లాకు చేరుకున్నాయి. అక్కడి 'సూర్యప్రభ ఫార్మా కెమ్' ఫ్యాక్టరీపై దాడి చేసి అక్రమంగా తయారు చేస్తున్న 30 కిలోల ఆల్ప్రాజోలంతో పాటు రూ.12 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ.4 కోట్ల విలువైన కెమికల్ ఫ్యాక్టరీని కూడా అధికారులు జప్తు చేశారు. మొత్తం ఆపరేషన్‌లో 32.5 కిలోల ఆల్ప్రాజోలం పట్టుబడినట్లు వెల్లడించారు.

### ఆస్తులూ వదలం!

మాదకద్రవ్యాల అక్రమ వ్యాపారంతో సంపాదించిన సొమ్ముతో ఆస్తులు కూడబెట్టేవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఈగల్ ఫోర్స్ అధికారులు హెచ్చరించారు. అక్రమ దందాలో ఎంతటి వారున్నా చట్టం ముందు నిలబెడతామని, డ్రగ్స్ సొమ్ముతో సమకూర్చుకున్న ఆస్తులను గుర్తించి జప్తు చేస్తామని స్పష్టం చేశారు.

# రాష్ట్రంలో ఇల్లు లేని పేద ఉండొద్దు




- అసంపూర్తి గృహాలనూ పూర్తి చేసి నిరుపేదలకు అందిస్తాం
- నూకలపల్లి 5,400 ఇళ్లకు రూ.32 కోట్లతో మౌలిక వసతులు
- కాలనీకి పాఠశాల, ఆసుపత్రి, చర్చి, మసీదు మంజూరుకు హామీ
- పోలీస్ ఔట్‌పోస్ట్, బస్సు సౌకర్యం, రేషన్ డీలర్ ఏర్పాటుకు ఆదేశాలు
- అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు: మంత్రి పొంగులేటి

**జగిత్యాల, ఆగస్టు 21:** రాష్ట్రంలో సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబం ఉండకూడదన్న లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంతో కొత్తగా గృహాలు మంజూరు చేయడంతో పాటు గత ప్రభుత్వాల హయాంలో ప్రారంభించి అసంపూర్తిగా వదిలేసిన ఇళ్లను కూడా పూర్తి చేసి పేదలకు అందిస్తామని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించి మౌలిక వసతులతో నివాసయోగ్యంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. జగిత్యాల జిల్లా పర్యటనలో భాగంగా నూకలపల్లిలో నిర్మించిన అర్బన్ హౌసింగ్ కాలనీలోని గృహ సముదాయాన్ని మంత్రి పరిశీలించారు. లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించి, కానుకలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జగిత్యాల పట్టణంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నూకలపల్లిలో గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన 5,400 ఇళ్ల మరమ్మతులు, మౌలిక వసతుల కల్పన కోసం ప్రజా ప్రభుత్వం తొలి విడతలో రూ.32 కోట్లు విడుదల చేసిందని పొంగులేటి తెలిపారు. ఈ నిధులతో తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరిచినట్లు చెప్పారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేసి అర్హులైన నిరుపేదలకు అందించేందుకు చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కాలనీలో మరికొన్ని సదుపాయాలు కల్పించాలన్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ విజ్ఞప్తిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. పాఠశాల భవనం, ఆసుపత్రి, చర్చి, మసీదు ఏర్పాటుకు రెండు రోజుల్లోనే మంజూరు ఇస్తామని హామీ ఇచ్చారు. కాలనీలో వెంటనే పోలీస్ ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయడంతో పాటు బస్సు సౌకర్యం కల్పించాలని, రేషన్ డీలర్‌ను నియమించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాలనీలో ఇంకా మిగిలిపోయిన ఇళ్లను త్వరితగతిన అర్హులైన లబ్ధిదారులకు కేటాయించాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి అర్హత ఉన్న పేద కుటుంబాలకు తప్పకుండా గృహాలు మంజూరు చేయాలని స్పష్టం చేశారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ప్రమాదవశాత్తు నీటి గుంటలో పడి మృతి చెందిన ఇద్దరు బాలుర కుటుంబాలకు ప్రభుత్వం తరఫున ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున పరిహార చెక్కులను మంత్రి అందజేశారు.



# చెప్పాల్సింది చెప్పేశా..

### షోకాజ్‌పై క్రమశిక్షణ కమిటీకి వివరణ ఇచ్చా
### సీఎం రేవంత్ విదేశీ పర్యటన నుంచి వచ్చాక స్పందిస్తా
### కుమార్తె సుస్మిత వ్యాఖ్యలు వ్యక్తిగతమేనన్న కొండా సురేఖ

**హైదరాబాద్, ఆగస్టు 21:** కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన షోకాజ్ నోటీసుపై తాను చెప్పాల్సిందంతా చెప్పేశానని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై ప్రస్తుతం కొత్తగా చెప్పాల్సిందేమీ లేదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన నుంచి తిరిగి వచ్చిన తర్వాత మాట్లాడతానని వెల్లడించారు. "నేను చెప్పాల్సింది నిన్ననే క్రమశిక్షణ కమిటీకి చెప్పాను. ఇప్పుడు కొత్తగా చెప్పాల్సిన విషయాలేమీ లేవు. ఈ అంశంపై ప్రస్తుతం మీడియాతో మాట్లాడను. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన నుంచి వచ్చాక మాట్లాడతాను" అని కొండా సురేఖ పేర్కొన్నారు. ఇటీవల వరంగల్ జిల్లా గీసుకొండలో జరిగిన కొండా సురేఖ జన్మదిన వేడుకల్లో ఆమె కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో కలకలం రేపిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి ఆమె చేసిన వ్యాఖ్యలను పార్టీ అధిష్ఠానం తీవ్రంగా పరిగణించింది. ఈ నేపథ్యంలో కొండా సురేఖకు కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. నోటీసులపై ఇప్పటికే క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్‌కు కొండా సురేఖ లిఖితపూర్వక వివరణ పంపారు. సుస్మిత చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగతమని, వాటితో తనకు ఎలాంటి సంబంధం లేదని అందులో స్పష్టం చేశారు. కుమార్తె చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలకు తనను రాజకీయంగా బాధ్యురాలిని చేయడం సముచితం కాదని పేర్కొంటూ తనకు జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకోవాలని కోరారు. మరోవైపు సుస్మిత వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహంగా ఉన్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్ అధిష్ఠానం కూడా ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం. నేరుగా ముఖ్యమంత్రిని లక్ష్యంగా చేసుకుని మంత్రి కుమార్తె చేసిన విమర్శలు పార్టీలో చర్చనీయాంశంగా మారాయి. షోకాజ్ నోటీసుతోనే వ్యవహారాన్ని ముగిస్తారా? లేక క్రమశిక్షణ చర్యల దిశగా ముందుకెళ్తారా? అన్నది ఇప్పుడు కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# తానెక్కడా కాంగ్రెస్ నేతలను విమర్శించలేదు

### మరోమారు రాజగోపాల్ రెడ్డి వివరణ

**యాదాద్రిభువనగిరి, ఆగస్ట్ 21:** కాంగ్రెస్‌లో బయట నుంచి వచ్చిన నాయకుల పెత్తనం ఎక్కువైందని మాత్రమే తాను చెప్పానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. తానుచేసిన ఈ వ్యాఖ్యలపై మరోసారి మీడియాకు ఆయన క్లారిటీ ఇచ్చారు. శుక్రవారం యాదాద్రి జిల్లాలోని చౌటుప్పల్ సీతారామచంద్రస్వామి ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రాజ్‌గోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్‌లోనే ఉంటానని స్పష్టం చేశారు. తానెక్కడా కాంగ్రెస్ నాయకులను విమర్శించలేదని, విమర్శించనని రాజ్‌గోపాల్ రెడ్డి తేల్చిచెప్పారు. నిజమైన కాంగ్రెస్ నాయకులను అణిచివేస్తున్నారనే విషయాన్ని తాను గుర్తు చేశానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో భాగంగా ఉద్యమకారులకు గుర్తింపు ఉండాలని సూచించారు. సీమాంధ్ర పాలకులు, సీమాంధ్ర మీడియా చెప్పుచేతల్లో తెలంగాణ కాంగ్రెస్, ప్రభుత్వం నడపవద్దని కోరారు. ప్రజాపాలన అంటే పేదల కోసం పని చేయాలని సూచించారు. పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్లకు సీమాంధ్ర నాయకుల కోసం కాదని తెలిపారు. తెలంగాణ ఇచ్చింది, తెచ్చింది కాంగ్రెస్ పార్టీనే అని ప్రస్తావించారు. తెలంగాణ అభివృద్ధి కూడా కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

# ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమస్యల పరిష్కారానికి కృషి

### ఎక్కువ సంఖ్యలో కూలీలను నమోదు చేయాలి : మంత్రి సీతక్క వెల్లడి



**హైదరాబాద్, ఆగస్ట్ 21:** ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం సానుకూలంగా ఉందని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పెంచడంలో ఫీల్డ్ అసిస్టెంట్ల పాత్ర కీలకమైనదని ఈ సందర్భంగా మంత్రి సీతక్క అభివర్ణించారు. మీరు ఎక్కువ సంఖ్యలో కూలీలను నమోదు చేసి.. వారితో పనులు చేయించాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రతిరోజు రెండు లక్షల కంటే తక్కువగా కూలీల నమోదు ఉందని వివరించారు. శుక్రవారం హైదరాబాద్ లో ఫీల్డ్ అసిస్టెంట్ ప్రతినిధులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. చాలా ఏళ్లుగా వారి సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. గత ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్‌లను విధుల నుంచి తప్పించిందని మండిపడ్డారు. వారిని తిరిగి ఫీల్డ్ అసిస్టెంట్లగా తమ ప్రభుత్వం విధుల్లోకి తీసుకుందని గుర్తు చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ల మధ్య వేతనంలో వ్యత్యాసం ఉందని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ సైజు, పనుల కల్పనకు ముడి పెట్టకుండా ఫీల్డ్ అసిస్టెంట్‌లందరికీ ఒకే విధంగా వేతనం ఉండేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు. అలాగే ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని భరోసా కల్పించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు.. తమను ఎఫ్‌టీఈలుగా గా కన్వర్ట్ చేయాలని కోరుతున్నారని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలతో చర్చించి.. త్వరలో తమ నిర్ణయాన్ని ప్రకటిస్తామని వెల్లడించారు. ఆ సంఖ్యను కనీసం12 లక్షలకు పెంచాల్సిన అవసరం ఉందని సందర్భంగా మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాలు కూలీలతో పనులు చేయించినప్పుడు.. మనం ఎందుకు చేయించ లేకపోతున్నామని ఫీల్డ్ ప్రతినిధుల బృందాన్ని మంత్రి సీతక్క సూటిగా ప్రశ్నించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు మరింత క్రియాశీలకంగా వ్యవహరించి ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాల్సి ఉందని సూచించారు.

## సంపాదకీయం



# ప్రియాంకే బెటర్ ఛాయిస్!

### రాహుల్‌తో పోలిస్తే పరిణతి చెందిన నాయకత్వం
### పార్లమెంటులో సమస్యలపై సందర్భోచిత స్పందన
### మోదీ, బీజేపీని ఎదుర్కోవడంలో స్పష్టమైన వైఖరి
### వందేమాతరం చర్చలో ఆకట్టుకున్న ప్రియాంక
### విపక్ష నేతగా ముందుకు తెస్తే కాంగ్రెస్‌కు మేలే

పార్లమెంట్ సమావేశాలు ముగిసిన తీరును గమనిస్తే ప్రతిపక్షాలు సభను స్తంభింపజేయడం మినహా ప్రజల ముందుకు బలమైన ప్రత్యామ్నాయ రాజకీయ అజెండాను తీసుకురాలేకపోయాయనే అభిప్రాయం కలుగుతోంది. అయితే ఈ సమావేశాల్లో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా వ్యవహరించిన తీరు మాత్రం ఆశాజనకంగా కనిపించింది. సభ లోపలా, బయటా అంశాలను ఎంచుకుని సందర్భోచితంగా స్పందించడం, రాజకీయ ప్రత్యర్థుల విమర్శలకు సమాధానం ఇవ్వడం ద్వారా ఆమె పరిణతి చెందిన నేతగా కనిపించారు. ముఖ్యంగా ప్రధాని మోదీని, బీజేపీని రాజకీయంగా ఎదుర్కొనే విషయంలో ప్రియాంక అనుసరిస్తున్న పద్ధతి రాహుల్ గాంధీ కంటే భిన్నంగా కనిపిస్తోంది. సమస్యను పట్టుకుని, దానిపై తన వాదనను ప్రజలకు అర్థమయ్యేలా చెప్పే ప్రయత్నం ఆమెలో కనిపిస్తోంది. కాంగ్రెస్ భవిష్యత్ రాజకీయాలకు ఆమె మరింత సమర్థంగా దిశానిర్దేశం చేయగలరనే అభిప్రాయానికి ఇదే కారణం.



రాహుల్ గాంధీ విమర్శలు ఎక్కువగా మోదీని లక్ష్యంగా చేసుకునే సాగుతున్నాయి. ఓట్ల తొలగింపు, నిరుద్యోగం వంటి అంశాలను ఆయన పదేపదే ప్రస్తావిస్తున్నా.. దేశంలో సామాన్య ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పార్లమెంట్ వేదికగా సమగ్రంగా చర్చకు తీసుకురావడంలో ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోతున్నారు. ప్రభుత్వంపై ఆరోపణలు చేయడంతోపాటు వాటికి బలమైన ఆధారాలు, ప్రత్యామ్నాయ పరిష్కారాలు చూపగలిగితేనే విపక్ష నాయకత్వానికి విశ్వసనీయత పెరుగుతుంది. వందేమాతరం అంశంపై జరిగిన చర్చలో ప్రియాంక స్పందించిన తీరు ఇందుకు భిన్నంగా కనిపించింది. ప్రతిసారీ నెహ్రూను లక్ష్యంగా చేసుకోవడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. నెహ్రూపైనే చర్చించాలనుకుంటే ఒకరోజంతా చర్చిద్దామన్న రీతిలో ఎదురుదాడి చేశారు. రాజకీయ విమర్శను రాజకీయంగానే తిప్పికొట్టే ప్రయత్నం చేశారు. ప్రత్యర్థి వాదనలోని బలహీనతలను గుర్తించి స్పందించే సామర్థ్యం ఆమెలో కనిపించింది. అయితే ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగ సంస్థల పనితీరుపై విమర్శలు చేసేటప్పుడు కాంగ్రెస్ మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ఎన్నికల వ్యవస్థలో లోపాలున్నాయని భావిస్తే నిర్దిష్ట ఆధారాలు చూపాలి. అవసరమైన సంస్కరణలను సూచించాలి. ఎన్నికల సంఘం నిర్ణయాలను ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో భాగమే అయినా.. మొత్తం వ్యవస్థపైనే అనుమానాలు కలిగించేలా రాజకీయ విమర్శలు సాగితే ఆశించిన ప్రయోజనం ఉండదు. కాంగ్రెస్ దశాబ్దాల పాటు దేశాన్ని పాలించింది. ఎన్నికల వ్యవస్థ, రాజ్యాంగ సంస్థల బలాలు, బలహీనతలపై ఆ పార్టీకి విస్తృత అనుభవం ఉంది. అందువల్ల అధికార పక్షాన్ని విమర్శించడమే కాకుండా నిర్మాణాత్మక ప్రత్యామ్నాయాలను ప్రజల ముందు ఉంచాల్సిన బాధ్యత కూడా కాంగ్రెస్‌పైనే ఎక్కువగా ఉంటుంది. ఇక్కడే రాహుల్, ప్రియాంక మధ్య తేడా కనిపిస్తోంది. రాహుల్ రాజకీయ ప్రసంగాలు కొన్ని అంశాల చుట్టూనే తిరుగుతుండగా, ప్రియాంక అంశాన్ని బట్టి తన వాదనను మార్చుకుంటూ ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఆమెకు మరిన్ని కీలక అంశాలపై మాట్లాడే అవకాశం కల్పిస్తే రాజకీయంగా మరింత రాటుదేలే అవకాశముంది. ప్రత్యేకించి డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లు, ధరల పెరుగుదల, నిరుద్యోగం, రైతాంగం, సమాఖ్య వ్యవస్థ వంటి ప్రజలపై నేరుగా ప్రభావం చూపే అంశాల్లో ప్రియాంకను ముందుకు తీసుకురావడం కాంగ్రెస్‌కు ప్రయోజనకరంగా ఉండొచ్చు. విపక్షం అంటే సభను స్తంభింపజేయడం మాత్రమే కాదు. ప్రజల సమస్యలను ప్రభుత్వం ముందుంచి సమాధానం రాబట్టడం, ప్రత్యామ్నాయ విధానాలను ప్రతిపాదించడం కూడా దాని బాధ్యత. ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్‌కు కావాల్సింది కేవలం ప్రభుత్వ వ్యతిరేక నినాదం కాదు.. ప్రజలను ఆకట్టుకునే సమర్థమైన నాయకత్వం. పార్లమెంటులో ఇటీవల ప్రియాంక ప్రదర్శిస్తున్న తీరు చూస్తే ఆ పాత్రకు ఆమెను మరింతగా ఉపయోగించుకోవడం కాంగ్రెస్‌కు మేలు చేయవచ్చు. విపక్ష నాయకత్వంలో ఆమెకు కీలక బాధ్యతలు అప్పగిస్తే కాంగ్రెస్ రాజకీయాలకు కొత్త దూకుడు వచ్చే అవకాశాన్ని కొట్టిపారేయలేం.

# పెల్లెట్ బాధితుడి కోసం రాహుల్ బైఠాయింపు

- ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ డిమాండ్
- బాధితుడు సాహిల్‌తో ఠాణాకు రాహుల్
- కేసు నమోదుకు పోలీసులు నిరాకరించారంటూ నిరసన
- పార్లమెంట్ స్ట్రీట్ ఠాణా ఎదుట బైఠాయింపు
- పెల్లెట్ ప్రయోగించలేదంటున్న పోలీసులు



**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** పెల్లెట్ గన్ ప్రయోగంలో గాయపడినట్లు ఆరోపిస్తున్న యువకుడికి న్యాయం చేయాలంటూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఢిల్లీలో నిరసనకు దిగారు. బాధితుడిగా చెబుతున్న సాహిల్ లోచాబ్‌ను వెంట తీసుకుని పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ఆయన.. ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు కేసు నమోదుకు నిరాకరించారంటూ పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించారు. 'సంసద్ ఛలో యాత్ర' సందర్భంగా పెల్లెట్ గన్ ప్రయోగంతో తనకు గాయాలయ్యాయని సాహిల్ లోచాబ్ ఆరోపిస్తున్నారు. ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పలుమార్లు కోరినా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సాహిల్‌కు మద్దతుగా రాహుల్ గాంధీ రంగంలోకి దిగారు. తొలుత సాహిల్‌తో కలిసి కన్నాట్ ప్లేస్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన రాహుల్.. న్యూఢిల్లీ డీసీపీ సచిన్ శర్మ పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో ఉన్నారని తెలియడంతో అక్కడికి చేరుకున్నారు. పెల్లెట్ గన్ ఘటనపై ఇప్పటివరకు జరిగిన దర్యాప్తు వివరాలను వెల్లడించాలని పోలీసులను కోరారు. అయితే ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి పోలీసులు నిరాకరించారని కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి. దీంతో అసంతృప్తి వ్యక్తం చేసిన రాహుల్ గాంధీ పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన చేపట్టారు. బాధితుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 'సంసద్ ఛలో యాత్ర' సందర్భంగా పార్లమెంట్ సమీపంలో విద్యార్థులపై ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది పెల్లెట్ గన్ ప్రయోగించారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. అయితే పెల్లెట్ గన్ ప్రయోగించారన్న ఆరోపణలను ఢిల్లీ పోలీసులు తోసిపుచ్చారు. ఈ నేపథ్యంలో బాధితుడి ఆరోపణలు, కాంగ్రెస్ నిరసనతో ఈ వ్యవహారం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

# హత్య కేసులో 105 ఏళ్ల వృద్ధుడికి ఊరట

### జీవిత ఖైదును రద్దు చేసిన సుప్రం కోర్టు



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 21:** హత్యకేసులో జీవిత ఖైదు శిక్ష పడిన 105 ఏళ్ల వృద్ధుడికి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. మిగిలిన శిక్షా కాలాన్ని రద్దు చేస్తూ శుక్రవారం సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించింది. ఆ వివరాల్లోకి వెళితే.. పశ్చిమ బెంగాల్‌లోని మల్ద జిల్లాకు చెందిన రసిక్ చంద్ర మొండల్ 1920లో జన్మించారు. 1988లో మర్డర్ కేసులో ఆయన జైలు పాలయ్యారు. 1994లో కోర్టు అతడిని దోషిగా తేల్చి జీవిత ఖైదు విధించింది. తనకు పడ్డ శిక్షను సవాల్ చేస్తూ మొండల్ 2018లో కోల్‌కతా హైకోర్టులో పిటిషన్ వేశారు. హైకోర్టు ఆయన పిటిషన్‌ను కొట్టేసింది. తర్వాత అపెక్స్ కోర్టుకు వెళ్లగా.. అక్కడ కూడా మొండల్‌కు నిరాశే ఎదురైంది. దీంతో మొండల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వయసును దృష్టిలో ఉంచుకుని శిక్షా కాలం ముగియటానికంటే ముందే తనను రిలీజ్ చేయాలంటూ ఆయన పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు 2024 నవంబర్ 29వ తేదీన మొండల్‌కు మధ్యంతర బెయిల్ మంజూర్ చేసింది. శుక్రవారం మరోసారి సుప్రీంకోర్టులో మొండల్ పిటిషన్‌పై విచారణ జరిగింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వీ మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం పిటిషన్‌పై విచారణ జరిపింది. పిటిషనర్ వయసును దృష్టిలో ఉంచుకుని కేసును ముగిస్తున్నట్లు ధర్మాసనం స్పష్టం చేసింది. మిగిలిన శిక్షాకాలాన్ని కూడా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. సుప్రీంకోర్టు తీర్పుతో 105 ఏళ్ల వయసులో రసిక్ చంద్ర మొండల్ జీవిత ఖైదు నుంచి విముక్తి పొందారు.

# జ్యుడీషియల్ సర్వీస్‌కు ప్రాక్టీస్ ఏడాదే

### సుప్రీంకోర్టు కీలక నిర్ణయం

### సివిల్ జడ్జి పోస్టులకు మూడేళ్ల అనుభవ నిబంధన సవరణ


### 2027 మార్చి వరకు లా గ్రాడ్యుయేట్లకు అనుభవంతో సంబంధం లేకుండా మినహాయింపు

**న్యూఢిల్లీ:** జ్యుడీషియల్ సర్వీసుల్లోకి నేరుగా ప్రవేశించాలనుకునే యువ న్యాయ విద్యార్థులకు సుప్రీంకోర్టు తీపి కబురు అందించింది. సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు గతంలో ఉన్న మూడేళ్ల న్యాయవాద వృత్తి ప్రాక్టీస్ నిబంధనను ఒక సంవత్సరానికి తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. సిజెఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఆగస్ట్ జార్జ్ మసీహ్, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. కనీస అనుభవం ఉండాలన్న ప్రాథమిక ఉద్దేశాన్ని సమర్థిస్తూనే, యువ లా గ్రాడ్యుయేట్లు, మహిళలు, దివ్యాంగులు నష్టపోకూడదనే ఉద్దేశంతో ఈ సవరణ చేసినట్లు కోర్టు స్పష్టం చేసింది. అభ్యర్థులకు ఊరటనిస్తూ సుప్రీంకోర్టు కొన్ని కీలక మినహాయింపులను ప్రకటించింది. 2025 మే 20 నుండి 2027 మార్చి 31 మధ్య వెలువడే సివిల్ జడ్జి పరీక్షల నోటిఫికేషన్లకు ఎటువంటి ప్రాక్టీస్ అనుభవం లేని లా గ్రాడ్యుయేట్లు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. ఈ కాలంలో ఎంపికైన అభ్యర్థులు నేరుగా ట్రైనీ జ్యుడీషియల్ ఆఫీసర్లుగా నియమితులై, ఒక సంవత్సరం స్టేట్ జ్యుడీషియల్ అకాడమీ శిక్షణతో పాటు మరో సంవత్సరం స్ట్రక్చర్డ్ లా క్లర్క్‌షిప్ పూర్తి చేయాల్సి ఉంటుంది. అయితే, 2027 ఏప్రిల్ 1 నుండి వచ్చే నోటిఫికేషన్లకు మాత్రం కనీసం ఒక సంవత్సరం యాక్టివ్ ప్రాక్టీస్ అనుభవం తప్పనిసరి అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.




# డీలిమిటేషన్‌పై ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు?

- మహిళా రిజర్వేషన్ల అమలుపైనా ఉత్కంఠ
- దక్షిణాది ప్రాతినిధ్యం తగ్గొద్దంటున్న రాష్ట్రాలు
- ప్రాంతీయ మండలిలో అంశాన్ని ప్రస్తావించిన అమిత్ షా
- రాష్ట్రాల వాటాకు హామీ కోరిన తమిళనాడు
- కేంద్రం తదుపరి అడుగుపై రాజకీయ వర్గాల్లో చర్చ






**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అమలు కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను నిర్వహించనుందా? ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో ఇదే అంశంపై ఆసక్తికర చర్చ సాగుతోంది. వర్షాకాల సమావేశాల్లోనే దీనిపై కీలక అడుగు పడుతుందన్న అంచనాలు తొలుత వెలువడినా, ఇతర రాజకీయ వివాదాల నేపథ్యంలో డీలిమిటేషన్ అంశం వెనక్కి వెళ్లినట్లు కనిపించింది. అయితే తాజాగా దక్షిణాది రాష్ట్రాల సమావేశంలో ఈ అంశం ప్రస్తావనకు రావడంతో మరోసారి చర్చ మొదలైంది. గురువారం జరిగిన దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా నియోజకవర్గాల పునర్విభజన అంశాన్ని ప్రస్తావించినట్లు సమాచారం. డీలిమిటేషన్‌పై మొదటి నుంచీ దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈ చర్చకు రాజకీయ ప్రాధాన్యం ఏర్పడింది. ప్రధానంగా జనాభా నియంత్రణను సమర్థంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు లోక్‌సభ ప్రాతినిధ్యంలో నష్టం జరగకూడదన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది. తమిళనాడు కూడా ఇదే అంశాన్ని కేంద్రం ముందు ఉంచింది. ప్రస్తుతం ఉన్న పార్లమెంటరీ ప్రాతినిధ్యంలో రాష్ట్రాల వాటా తగ్గకుండా చట్టపరమైన రక్షణ కల్పించాలని, దీనిపై కేంద్రం స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరింది. దక్షిణాది రాష్ట్రాల ప్రస్తుత వాటాకు ఎలాంటి నష్టం ఉండదని కేంద్రం హామీ ఇస్తే డీలిమిటేషన్‌పై వ్యతిరేకత కొంత తగ్గే అవకాశం ఉందన్న చర్చ కూడా రాజకీయ వర్గాల్లో సాగుతోంది. అయితే దీనిపై కేంద్రం నుంచి ఇప్పటివరకు స్పష్టమైన కార్యాచరణ వెలువడాల్సి ఉంది. మరోవైపు మహిళా రిజర్వేషన్ అమలు కూడా జనగణన, డీలిమిటేషన్ ప్రక్రియతో ముడిపడి ఉండటంతో కేంద్రం తదుపరి అడుగు అత్యంత కీలకంగా మారింది. మహిళలకు లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో 33 శాతం రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన ప్రక్రియ ఎప్పుడు మొదలవుతుందన్న ప్రశ్న కూడా రాజకీయ పార్టీల్లో చర్చనీయాంశంగా ఉంది. ఈ నేపథ్యంలో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లపై విస్తృత రాజకీయ ఏకాభిప్రాయం కోసం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను కేంద్రం నిర్వహిస్తుందా? లేక తదుపరి సాధారణ సమావేశాల్లోనే ముందుకు వెళ్తుందా? అన్న ఉత్కంఠ కొనసాగుతోంది. ప్రత్యేక సమావేశాలపై అధికారిక ప్రకటన వెలువడకపోయినప్పటికీ, దక్షిణాది రాష్ట్రాల అభ్యంతరాలు, మహిళా రిజర్వేషన్ల అమలు, భవిష్యత్ లోక్‌సభ స్థానాల సంఖ్య వంటి కీలక అంశాల నేపథ్యంలో కేంద్రం తీసుకునే నిర్ణయం దేశ రాజకీయాల్లో అత్యంత కీలకంగా మారనుంది.

## జిల్లా కేంద్రంలో స్మార్ట్ కార్డుల పంపిణీ



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం సంబంధిత రేషన్ డీలర్లు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. జిల్లా కేంద్రంలోని ఆరవ వార్డులో మాజీ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ,కౌన్సిలర్ చిలువేరు వెంకటేశ్వర్లు రేషన్ డీలర్ రావుల రంగన్నతో కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. మిగతా లబ్ధిదారులు సంబంధిత రేషన్ డీలర్ ను సంప్రదించి స్మార్ట్ రేషన్ కార్డులను తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## నూతన ఎంపీడీఓకు ఘన సన్మానం



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ)గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన గంగాసాగర్ రెడ్డిని శుక్రవారం పలువురు గ్రామాల సర్పంచులు ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలోని కార్యాలయంలో ఎంపీడీఓను కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఎంపీడీఓతో సర్పంచులు చర్చించారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు అధికార యంత్రాంగం సహకరించాలని కోరారు. ప్రజలకు అవసరమైన సమస్యలను పరిష్కరించేందుకు సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా కృషి చేయాలని ఎంపీడీఓను కోరారు. ఈ కార్యక్రమంలో వడూర్ గ్రామ సర్పంచ్ శ్రీకాంత్, బోరిగాం సర్పంచ్ రాథోడ్ వినేష్, నాయకులు బైరి రాజేందర్, అమృత్, గంగాధర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్పీఓలో సభ్యత్వం తీసుకోండి.. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోండి



**ఉద్యమ కెరటం, తాండూర్:** సాగు ఖర్చులు తగ్గించి రైతులకు మెరుగైన ఆదాయం అందించేందుకు ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ (ఎఫ్పీఓ)గొప్ప అవకాశమని పీఏసీఎస్ సీఈఓ అనీల్ కుమార్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏర్పాటు చేసిన ఎఫ్పీఓలో రైతులు ఈనెల 25వ తేదీలోగా సభ్యులుగా చేరాలని విజ్ఞప్తి చేశారు. ఎఫ్పీఓ ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు తక్కువ ధరకు అందుబాటులో ఉంటాయని, అదేవిధంగా రైతులు పండించిన పంటలను సమిష్టిగా మార్కెటింగ్ చేసి మెరుగైన ధరలు పొందే వీలు కలుగుతుందని తెలిపారు. సభ్యత్వానికి అర్హతలు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్, రూ.2వేల వాటా సొమ్ము చెల్లించాల్సి ఉంటుందని, ప్రతి వాటాదారుడికి కేంద్ర ప్రభుత్వం తరపున మరో రూ.2వేల వాటా సొమ్మును అదనంగా అందజేస్తారని వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాల కోసం తాండూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## పార్టీ బలోపేతానికి ఐక్యంగా పనిచేయాలి




**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** భోరజ్ మండల కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ ఏర్పాటుపై స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుడు కంది శ్రీనివాసరెడ్డి కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా చర్చించారు. సమావేశానికి యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతన్రావు, ఆత్మ కమిటీ చైర్మన్ సంతోష్రావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు దీపక్రావుతో పాటు మండల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా భోరజ్ మండల కాంగ్రెస్ నూతన కమిటీని పటిష్టంగా ఏర్పాటు చేయడం, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటాలు నిర్వహించాలని నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి మరింత బలం చేకూరేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నూతన కమిటీ ఏర్పాటుకు సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. నూతన కమిటీతో భోరజ్ మండలంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## శ్రీశ్రీశ్రీ పూలాజీ బాబా జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

- **జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** ఈనెల 28, 29, 30 తేదీలలో జరగనున్న శ్రీశ్రీశ్రీ పూలాజీ బాబా జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యురాలు కోవ లక్ష్మితో కలిసి ఉత్సవాల నిర్వహణపై గిరిజన సంక్షేమ, విద్యుత్, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, వైద్య, ఆర్.టి.సి. శాఖల అధికారులు, పూలాజీ బాబా ఉత్సవ నిర్వహణ కమిటీ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని జైనూర్ మండలం పట్నాపూర్ లోని పూలాజి బాబా సంస్థానంలో నిర్వహించే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. జయంతి ఉత్సవాలకు తెలంగాణ, మహారాష్ట్ర, చత్తీస్ గడ్ రాష్ట్రాల నుండి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు. ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసన సభ్యురాలు మాట్లాడుతూ జయంతి వేడుకలకు వచ్చే ప్రజల కొరకు పట్నాపూర్ కు వెళ్లే దారిలో రహదారి మరమ్మత్తులు పూర్తి చేయాలని, ఆర్.టి.సి. బస్సుల సౌకర్యం కొరకు ఆసిఫాబాద్, ఉట్నూర్ డిపో బస్సులు నడిపించాలని తెలిపారు. ఉత్సవాలు జరిగే 3 రోజులు నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, మిషన్ భగీరథ నీటి సరఫరా, వైద్య శిబిరాల నిర్వహణ అంశాలపై అధికారులు ఉత్సవ నిర్వహణ కమిటీ ప్రతినిధులు సమన్వయంతో పర్యవేక్షించాలని తెలిపారు. ఉత్సవాలలో ఎలాంటి లోపాలు లేకుండా ఏర్పాట్లు చేయాలని, 30వ తేదీన భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ఎలాంటి అసౌకర్యం కలగకుండా మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతరం పూలాజి బాబా జయంతి ఉత్సవాల గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఉత్సవ నిర్వహణ కమిటీ ప్రతినిధులు అధికారులకు, శాసన సభ్యులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, డి.ఎస్.పి. అశోక్, విద్యుత్ ఎస్.ఈ. ఉత్తమ్, సంబంధిత శాఖల అధికారులు, ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు ఇంగ్లే కేశవ్, నారాయణ, కైలాష్ పాల్గొన్నారు.

## తెలంగాణ వీరుల చరిత్రను లోకానికి చాటడమే లక్ష్యం

- **సాయుధ పోరాట తొలి అమరుడు 'దొడ్డి కొమురయ్య' చిత్రం నిర్మాణానికి శ్రీకారం**



**ఉద్యమ కెరటం, కరీంనగర్:** తెలంగాణ నేల అందించిన పోరాట పటిమను, ఇక్కడి వీరుల త్యాగాలను ప్రపంచానికి చాటిచెప్పాలనే దృఢ సంకల్పంతో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు "దొడ్డి కొమురయ్య" జీవిత చరిత్ర ఆధారంగా ఒక చిత్రం రూపుదిద్దుకుంటోంది. కేవలం పదివేల రూపాయల పెట్టుబడితో ఈ సినిమా నిర్మాణానికి అడుగులు పడటం విశేషం. ఈ చిత్ర నిర్మాణంలో కరీంనగర్ జిల్లాకు చెందిన, సబ్బండ వర్గ ప్రతినిధులు పిట్టల శివయ్య, మందుల చేగుర్తి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల కరీంనగర్లో జరిగిన కార్యక్రమంలో ఈ చిత్ర దర్శకుడు సేనాపతి ఆధ్వర్యంలో సహ నిర్మాత పిట్టల శివయ్యను శాలువాతో ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా సహ నిర్మాత పిట్టల శివయ్య మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో తన తండ్రి ఎల్లయ్య కీలక పాత్ర పోషించారని, ఆ పోరాట కాలంలో ఆయన రెండుసార్లు జైలు జీవితాన్ని కూడా అనుభవించారని గుర్తుచేసుకున్నారు. తన తండ్రి అందించిన స్ఫూర్తితోనే, తెలంగాణ వీరుడు దొడ్డి కొమురయ్య పేరుతో తెరకెక్కుతున్న ఈ చారిత్రాత్మక చిత్రానికి తన వంతు సహాయసహకారాలు అందించడాన్ని ఎంతో అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ సెంటిమెంట్ను, మన పోరాట చరిత్రను గౌరవించే ప్రతి ఒక్క తెలంగాణవాది ఈ సినిమా నిర్మాణానికి తమ వంతు సహాయం అందించి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



## లబ్ధిదారులంతా స్మార్ట్ రేషన్ కార్డులు తీసుకోవాలి

- **మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఎండి అహ్మద్**

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** ఆసిఫాబాద్ పట్టణంలోని బజార్వాడి రేషన్ షాపులో లబ్ధిదారులకు శుక్రవారం ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఎం.డి. అహ్మద్ చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైస్ చైర్ పర్సన్ ఎండి అహ్మద్ మాట్లాడుతూ రేషన్ కార్డుల లబ్ధిదారులకు ప్రభుత్వం మరింత సులభంగా, పారదర్శకంగా సేవలు అందించేందుకు ఈ స్మార్ట్ కార్డులు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులందరికీ కార్డులు అందజేస్తున్నామని, ఇంకా తీసుకోని వారు వెంటనే తమ పరిధిలోని రేషన్ డీలర్ను సంప్రదించి స్మార్ట్ రేషన్ కార్డులను పొందాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది రామారావు, రేషన్ డీలర్ అమన్, బీఆర్ఎస్ నాయకులు షబ్బీర్, షాకీర్, వార్డు మహిళలు యువకులు తదితరులు పాల్గొన్నారు.



## గురువుపై దాడి సమాజానికే మచ్చ

- **రూపారెడ్డి దారుణ హత్యను ఖండిస్తూ రోడ్డెక్కిన ఉపాధ్యాయులు**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలోని నాగార్జున పాఠశాల ప్రిన్సిపాల్ కె. రూపారెడ్డి దారుణ హత్యను ఖండిస్తూ జిల్లా కేంద్రంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద సుమారు 300 మంది పాఠశాల యజమానులు, ఉపాధ్యాయులు పాల్గొని మానవహారం నిర్వహించారు. అనంతరం రాస్తారోకో చేపట్టి, భారీ ర్యాలీగా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని అడిషనల్ కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ట్రాస్మా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పెద్దపల్లి కిషన్రావు, జిల్లా అధ్యక్షులు పరదేశీ దేవభూషణం, ప్రధాన కార్యదర్శి వొళ్ళోజుల తిరుపతి చారి మాట్లాడారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులపైనే దాడులకు తెగబడటం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాబోధనతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు నేర్పడమే ఉపాధ్యాయులు చేసిన తప్పా అని ప్రశ్నించారు. సెల్ఫోన్లు, సోషల్ మీడియా, హింసాత్మక ధోరణులు విద్యార్థులను పెడదోవ పట్టిస్తున్నాయని ఆందోళన చెందారు. ఉపాధ్యాయురాలిని విద్యార్థులే కిరాతకంగా హత్య చేయడం సమాజం సిగ్గుపడాల్సిన విషయమని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ట్రాస్మా నాయకులు సుబ్బ మహేష్, చిలుకూరి రాధాకృష్ణ చారి, దిక్కొండ సంజీవ్ కుమార్, దుర్గం గోపాల్, నాగేంద్ర, ముషీర్, చక్రపాణి, వెంకటేష్, సంతోష్, ఎలాగోట్టు తిరుపతి, సదానందం, సంజీయ్ సింగ్, జమీల్, జీతేష్, శితాని రమన్, బోరాయి కృష్ణ ప్రసాద్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## త్యాగాలు ఉద్యమకారులవి.. భోగాలు బీఆర్ఎస్ నాయకులవి

**కేకే మహేందర్రెడ్డి**

**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** తెలంగాణ ఉద్యమంలో త్యాగాలు చేసింది ఉద్యమకారులైతే.. భోగాలు అనుభవించింది మాత్రం బీఆర్ఎస్ నాయకులేనని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్రెడ్డి విమర్శించారు. శుక్రవారం కొత్తపల్లి గ్రామంలో రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి విజయం సాధించిన మహిళా క్రీడాకారులను ఘనంగా సన్మానించారు. జ్ఞాపికలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపల్లి గ్రామానికి చెందిన మహిళా క్రీడాకారులు త్రోబాల్ క్రీడలో రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటి గ్రామానికి, సిరిసిల్ల ప్రాంతానికి గర్వకారణంగా నిలిచారని కొనియాడారు. యువత క్రీడల్లో మరింతగా రాణించేందుకు ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు సహకరించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని, రాష్ట్రంలో ఉద్యోగాల కల్పనతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం మహిళల ఆర్థిక స్వాలంబనకు పెద్దపీట వేస్తోందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే సీఎం రేవంత్రెడ్డి లక్ష్యమని పేర్కొన్నారు. క్రీడాకారులకు తాను ఒక అన్నగా అండగా నిలుస్తానని, వారి ప్రతిభను ప్రోత్సహించేందుకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పర్శ హన్మాండ్లు, మాజీ మండల అధ్యక్షుడు హమీద్, నాయకులు రాజనర్సింహారెడ్డి, ఎలుక రాజు, గంగీ స్వామి, అజం, రాజం, రాజారెడ్డి, గోపాల్రెడ్డి, గణేష్, దేవగౌడ్, రాజయ్య, శ్రీనివాస్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



# మారుమూల గ్రామాల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఉట్నూర్ ఐటీడీఏ పీఓ మంద మకరందు



**ఉద్యమ కెరటం, తిర్యాణి:** మారుమూల గిరిజన గ్రామాల సమస్యలను పరిష్కరించి, గ్రామాల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి మంద మకరందు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన తిర్యాణి మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో సుడిగాలి పర్యటన నిర్వహించి, ప్రజా సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దంతన్‌పల్లిని సందర్శించగా, గతంలో ముంపునకు గురైన ఆశ్రమ పాఠశాలను తిరిగి ఏర్పాటు చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన పీఓ, పాఠశాల పునఃస్థాపనకు సంబంధించిన సమగ్ర నివేదికను వెంటనే సమర్పించాలని సంబంధిత డీడీని ఆదేశించారు. పాఠశాల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం పంగడి మాదన రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచులు, గ్రామస్తులు పాల్గొన్నారు. తిర్యాణి మండలంలోని మారుమూల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పంగడి మాదనలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని, అలాగే గోవెన, మార్కెగూడ తదితర గ్రామాలకు బిటి కనెక్టివిటీ రోడ్లు నిర్మించాలని పీఓను కోరారు. దీనిపై పీఓ స్పందిస్తూ, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని మౌలిక వసతులు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తర్వాత పంగడి మాదన ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు, సౌకర్యాలను పరిశీలించిన పీఓ, పదో తరగతి విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి విద్యా సామర్థ్యాలను సేకరించారు. విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు నెల రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించి, నిర్దిష్ట లక్ష్యాలతో బోధన చేపట్టాలని ఆదేశించారు.చివరగా చింతల మాదార జలపాతాన్ని సందర్శించి, పరిసర ప్రాంతాల్లో స్థానిక గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్పంచ్, గ్రామస్తులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ పర్యటనలో డీడీ జాదవ్ అంబాజీ, ఏ సి ఎం ఓ ఉద్ధవ్, సర్పంచ్ రాధాబాయి, స్థానిక అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పెండింగ్ భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలి

- ప్రాజెక్టుల పనులకు ఆటంకం లేకుండా చర్యలు చేపట్టాలి
- రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్కుమార్ రెడ్డి





**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టుల పనులు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్లో ఉన్న భూసేకరణ, పునరావాస ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో నీటిపారుదల ప్రాజెక్టుల పరిధిలోని పెండింగ్ భూసేకరణ అంశాలపై మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఆదిలాబాద్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ రాజర్షిషా వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణ పనులు సకాలంలో పూర్తయ్యేందుకు భూసేకరణ ప్రక్రియ కీలకమని తెలిపారు. పెండింగ్ భూసేకరణకు అవసరమైన నిధుల కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. భూసేకరణ కోసం రూ.2,800 కోట్లు విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ఆమోదం తెలిపారని పేర్కొన్నారు. ప్రాజెక్టుల ద్వారా కొత్త ఆయకట్టు సృష్టించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకు భూసేకరణ, పునరావాస ప్రక్రియలను సమాంతరంగా వేగవంతం చేయాలని సూచించారు. నిధులు అందుబాటులో ఉన్నందున కలెక్టర్లు, సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. భూసేకరణ, పునరావాస పనుల కారణంగా ప్రాజెక్టుల నిర్మాణానికి ఎలాంటి ఆటంకం కలగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని అన్నారు. క్షేత్రస్థాయిలో భూసేకరణకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడంతో పాటు, అవసరమైన ప్రాంతాల్లో నిర్వాసితులకు పునరావాస చర్యలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టుల పనుల పురోగతి, భూసేకరణ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, పెండింగ్ అంశాల పరిష్కారానికి సంబంధిత శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్లకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో అదనపు కలెక్టర్ ఆర్ఎస్.చిత్రు, ఆర్డీఓ జగదీశ్వర్రావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# యువత సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** మారుతున్న సాంకేతిక ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులు, యువత కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు వివిధ సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న శిక్షణ, విద్యా సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎన్టీఆర్ చౌక్లోని ఉర్దూ భవన్లో తెలంగాణ ప్రభుత్వ మైనారిటీ సంక్షేమ శాఖ, జిల్లా గ్రంథాలయ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఉర్దూ అకాడమీ కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్, పబ్లిక్ రీడింగ్ రూమ్లను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో కంప్యూటర్ పరిజ్ఞానం, సాంకేతిక నైపుణ్యాలు ప్రతిఒక్కరికీ ఎంతో అవసరమన్నారు. ముఖ్యంగా మైనారిటీ వర్గాలకు చెందిన యువత, నిరుద్యోగులు కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకుని తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు. సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు, నిరుద్యోగ అభ్యర్థులకు పబ్లిక్ రీడింగ్ రూమ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో చదువుకునేందుకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి తమ లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం కల్పిస్తున్న కంప్యూటర్ శిక్షణ, రీడింగ్ రూమ్ వంటి సదుపాయాలను యువతీ యువకులు పూర్తిస్థాయిలో వినియోగించుకుని విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కలీం, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సురేష్, అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే గేట్ నెంబర్ 68ను మూసివేయొద్దు



**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రైల్వే గేట్ నం.68ను మూసివేయవద్దని కోరుతూ కొత్తపల్లి సర్పంచ్ ఆకుల వెంకటేష్తో పాటు గ్రామస్తులు తహశీల్దార్ యు.జ్యోత్స్న, ఎంపీడీఓ పి.శ్రీనివాస్లకు శుక్రవారం వినతి పత్రాలు అందజేశారు. రైల్వే శాఖ గేట్ను మూసివేసి ప్రత్యామ్నాయంగా అండర్ బ్రిడ్జి, ఫ్లైఓవర్ నిర్మించనున్నట్లు సమాచారం ఉందని తెలిపారు. ప్రస్తుతం భారీ వర్షాల కారణంగా మండలంలోని ప్రధాన బ్రిడ్జిల వద్ద నీరు నిలిచిపోవడంతో తాండూర్, భీమిని, కన్నెపల్లి మండలాల ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో రేపల్లెవాడ వద్ద ఉన్న రైల్వే గేట్ మార్గం అనేక ప్రాంతాలకు ప్రధాన రహదారిగా ఉందన్నారు. గేట్ను మూసివేస్తే అంబులెన్సుల రాకపోకలకు ఆటంకం కలగడంతో పాటు విద్యార్థుల బస్సులు, ఇతర రవాణా వ్యవస్థలపై ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు మండలాల ప్రజల సాధారణ రాకపోకలు, వ్యవసాయ, వాణిజ్య, ఉపాధి, నిత్యావసర కార్యకలాపాలకు కూడా తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయని తెలిపారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని రైల్వే గేట్ ను మూసివేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాండూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పెద్దిబోయిన శంకర్, ఉపాధ్యక్షుడు షేక్ మోమిన్ అలీ, ప్రధాన కార్యదర్శి కట్కూల మల్లేష్, మండల యూత్ మాజీ అధ్యక్షుడు దేగ స్వామి, ఆకుల రజిని, గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

# 24న ఆటోల బంద్ జయప్రదం చేయండి



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఈనెల 24న నిర్వహించనున్న ఆటోల బంద్ను జయప్రదం చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ఆటో కార్మికులు పోస్టర్లను ఆవిష్కరించారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలం మర్లపాడు గ్రామంలోని శ్రీ ఆంజనేయ ఆటో యూనియన్ అడ్డా వద్ద కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్రావు మాట్లాడుతూ ఆర్టీసీ అనుసంధానంతో ఈవీ ఆటో విధానాన్ని తీసుకొస్తే ఆటో కార్మికుల జీవితాలు బుగ్గిపాలు అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఆటో కార్మికులకు ఇచ్చిన రూ.12వేల ఆర్థిక సాయం హామీని సీఎం రేవంత్రెడ్డి ప్రభుత్వం గాలికొదిలేసిందని విమర్శించారు. అలాగే ఆటో కార్మికుల కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ కూడా అమలుకు నోచుకోలేదన్నారు. సీఎం రేవంత్ సారు.. మీ హామీ అమలెక్కడ..? అని ప్రశ్నించారు. ఆటో బంద్లో రాజకీయాలకు అతీతంగా ఆటో, ట్రాక్టర్, కారు, జేసీబీ ఆపరేటర్లు పాల్గొని బంద్ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఆటో యూనియన్ అడ్డా అధ్యక్షులు సాధు సుధాకర్, కోశాధికారి రియాజ్, పూరేటి మల్లయ్య, బొండల యాకోబు, కంచర్ల వెంకటేశ్వరరావు, కొండయ్య, సురేష్, షేక్ యాకూబ్, కావూరి భగత్సింగ్, ముల్లంగి శ్రీను, సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మావల మండల కేంద్రంలో శుక్రవారం ప్రారంభించారు. లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ ప్రజా ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పారదర్శకంగా, ఎలాంటి ఆలస్యం లేకుండా అందాలనే ఉద్దేశంతోనే ఈ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని స్పష్టం చేశారు. ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తూ పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ముత్యం రావు, ఎంపీఓ నందిని, మావల సర్పంచ్ ధర్మపురి చంద్రశేఖర్, ఉప సర్పంచ్ స్వప్న అడెల్లు, వార్డు సభ్యులు, కంట్రోల్ డీలర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్కు సన్మానం



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కల్లూరు సబ్ కలెక్టర్ (ఆర్డీఓ) అజయ్ యాదవ్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్ శాలువాతో సత్కరించి, మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటాన్ని అందజేశారు. సామాజిక న్యాయం, సమానత్వం, అణగారిన వర్గాల అభ్యున్నతికి మహాత్మా జ్యోతిరావు పూలే చేసిన కృషిని స్మరించుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పరిపాలనను మరింత పారదర్శకంగా, ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం సత్తుపల్లి నియోజకవర్గ అధ్యక్షులు ఉప్పు హనుమంతు, కల్లూరు టౌన్ అధ్యక్షులు బయ్యారపు నరేంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు మల్లెలి శ్రీనివాసరావు, యువజన సంఘం సత్తుపల్లి నియోజకవర్గ అధ్యక్షులు కోమటి తిరుమలరావు, పెనుబల్లి మండల అధ్యక్షులు కర్రి కమలాకర్, కల్లూరు మండల ప్రధాన కార్యదర్శి వెంకటాచారి, బాలకృష్ణ, బొడ్డు కృష్ణ, షేక్ బాజీ తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వరలక్ష్మి వ్రతం నిర్వహించిన మున్సిపల్ చైర్పర్సన్



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** శ్రావణ శుక్రవారం సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ దంపతులు తమ స్వగృహంలో వరలక్ష్మి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ ఆదిలాబాద్ పట్టణంతో పాటు రాష్ట్ర, ప్రజలందరూ అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలతో సుఖ సంతోషంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రతి కుటుంబంపై వరలక్ష్మి దేవి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సాంప్రదాయాల ప్రకారం దైవ ప్రార్థనలు చేస్తూ మానసిక ప్రశాంతతతో, ఆనందంగా జీవించాలని కోరారు.

# జైనూర్ మండలంలో పిచ్చికుక్కల బెడద



**ఉద్యమ కెరటం, జైనూర్:** మండలంలోని పలు గ్రామాలు, ప్రధాన రహదారులు, నివాస ప్రాంతాల్లో పిచ్చికుక్కల సంచారం రోజురోజుకు పెరుగుతోంది. రోడ్లపై తిరుగుతున్న కుక్కల కారణంగా ప్రజలు, ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. కుక్కలు గుంపులుగా తిరుగుతూ వాహనదారులను వెంటపడటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉదయం–సాయంత్రం బయటకు వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. పిచ్చికుక్కల బెడదను అరికట్టేందుకు సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, కుక్కలను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# పోక్సో కేసులో నిందితుడికి నాలుగేళ్ల జైలు శిక్ష

## రూ.2వేల జరిమానా విధించిన సిరిసిల్ల పోక్సో కోర్టు



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి నాలుగేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధిక జైస్వాల్ శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ పాఠశాల ప్రాంగణంలోకి గోడ దూకి ప్రవేశించిన అగదండి రాజేందర్ అనే వ్యక్తి మైనర్ బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదు అందింది. పాఠశాల ప్రిన్సిపాల్ ఫిర్యాదు మేరకు అప్పటి గంభీరావుపేట ఎస్సై మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. దర్యాప్తు పూర్తి చేసిన పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు విచారణలో భాగంగా కోర్టు మానిటరింగ్ ఎస్సైలు రవీందర్ నాయుడు, శ్రవణ్ యాదవ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్, సీఎంఎస్ కానిస్టేబుల్ నవీన్, పోక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. మొత్తం పది మంది సాక్షులను విచారించగా, ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ జాన్సీ వాదనలు వినిపించారు. ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువైనట్లు నిర్ధారించి ఈ మేరకు శిక్ష విధించినట్లు తెలిపారు. సమాజంలో నేరాలకు పాల్పడే వారు ఎవరూ చట్టపరమైన శిక్ష నుంచి తప్పించుకోలేరని జిల్లా ఎస్పీ తెలిపారు. శిక్షల ద్వారా సమాజంలో మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పోలీసులు, ప్రాసిక్యూషన్ సమన్వయంతో సమర్థవంతమైన దర్యాప్తు, న్యాయ విచారణ చేపట్టి నిందితులకు తప్పనిసరిగా శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కేసులో పకడ్బందీగా దర్యాప్తు చేపట్టి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అప్పటి ఎస్సై మహేష్, ప్రస్తుత డీఎస్పీ నాగేంద్రచారి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ జాన్సీ, ఎల్లారెడ్డిపేట సర్కిల్ సీఐ ఓ.వెంకటేష్, గంభీరావుపేట ఎస్సై శ్రీకాంత్, కోర్టు మానిటరింగ్ ఎస్సైలు రవీందర్ నాయుడు, శ్రవణ్ యాదవ్, కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్, సీఎంఎస్ కానిస్టేబుల్ నవీన్, పోక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల, లీగల్ సపోర్ట్ పర్సన్ లహరికలను ఎస్పీ అభినందించారు.

# నైపుణ్య శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** మారుతున్న కాలానికి అనుగుణంగా యువత, మహిళలు నైపుణ్యాలను పెంపొందించుకుని స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూచించారు. శుక్రవారం భాగ్యనగర్లో భారత ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, ఉద్యమశీలత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న జన్ శిక్షణ్ సంస్థాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్స్ మోడల్ సెంటర్' నమూనాల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ హాజరై వివిధ నమూనాలను పరిశీలించారు. జన్ శిక్షణ్ సంస్థాన్లో శిక్షణ పొందిన అభ్యర్థులు రూపొందించిన చేతివృత్తుల వస్తువులు, కుట్టుపని ఉత్పత్తులు, వివిధ వృత్తి విద్యా ఉత్పత్తులు, ఇతర నైపుణ్య ఆధారిత నమూనాలను తిలకించారు. అభ్యర్థులు రూపొందించిన ఉత్పత్తులను అభినందించారు. శిక్షణ పూర్తయిన అనంతరం స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు కలెక్టర్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత, మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు నైపుణ్యాభివృద్ధి శిక్షణలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. సాంకేతిక, వృత్తి విద్యా రంగాల్లో నూతన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు, జన్ శిక్షణ్ సంస్థాన్ ద్వారా అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలను అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణ ద్వారా పొందిన నైపుణ్యాలను ఉపాధి, స్వయం ఉపాధి కోసం వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం.మనోహర్రావు, జిల్లా విద్యా శాఖ అధికారి మాధవి, ఎల్డీఎం ఉత్పాల్, సెడ్స్ డైరెక్టర్ సురేందర్, వివిధ శాఖల అధికారులు, జన్ శిక్షణ్ సంస్థాన్ ప్రతినిధులు, శిక్షణ పొందిన అభ్యర్థులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేద కుటుంబాలకు సొంతింటి కల సాకారం



**ఉద్యమ కెరటం, జైనూర్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద, నిరుపేద కుటుంబాల సొంతింటి కల సాకారం అవుతోందని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కూడ్మేత విశ్వనాథ్రావు అన్నారు. సిర్పూర్ (యూ) మండలం ధానోరా గ్రామపంచాయతీ పరిధిలోని ధానోరా తండాలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరై నూతన గృహంలో గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన పేద కుటుంబాలకు పక్కా ఇళ్లు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. సొంత ఇల్లు ప్రతి కుటుంబానికి భద్రత, ఆత్మవిశ్వాసాన్ని కల్పిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవీందర్, ఎంపీఓ ప్రమోద్, ఏపీఓ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆత్రం శంకర్రావు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు పెందోర్ గణపత్, మహాగాం సర్పంచ్ సేడ్మకి జనేరావు, ఆత్రం జలీమ్ షావ్, సోయం ముకుంద్రావు, ఆత్రం దౌలత్రావు, షేక్ హైదర్ తదితరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి స్ఫూర్తితో ప్రజా పోరాటాలు

- సీపీఐ సీనియర్ నాయకులు బద్రి సత్యనారాయణ



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్ వేదికగా భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తొలుత సీపీఐ అగ్రనేత కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డికి ఘనంగా నివాళులర్పించి సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీఐ సీనియర్ నాయకులు బద్రి సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ప్రజా పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సురవరం సుధాకర్ రెడ్డి చూపిన బాటలో నడుస్తూ ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. జిల్లాలోని ప్రధాన సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక ప్రణాళికతో పోరాట రూపకల్పన చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో పలు కీలక తీర్మానాలు ఆమోదించారు. కుమురం భీం ప్రాజెక్టు ఆయకట్టుకు వెంటనే మరమ్మతులు చేపట్టి సాగునీరు అందించాలని, వట్టివాగు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గుండి వాగు, లక్మాపూర్ బ్రిడ్జిల నిర్మాణాన్ని వేగవంతం చేయడంతో పాటు నేషనల్ హైవే నిర్మాణంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకుని, డీబీఎల్ కంపెనీని బ్లాక్లిస్ట్లో పెట్టాలని స్పష్టం చేశారు.పీఎం శ్రీ నిధుల వినియోగంలో జరిగిన అక్రమాలు, మహాత్మ జ్యోతిరావు పూలే బాలుర గురుకులంలో జరిగిన అడ్మిషన్ల ఆరోపణలపై ప్రత్యేక కమిషన్తో సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో సౌకర్యాలు మెరుగుపరచాలని, గిరిజన డిగ్రీ కళాశాలకు సొంత భవనం కేటాయించడమే కాకుండా డైట్ కళాశాలలో వచ్చే ఏడాది నుంచే అడ్మిషన్లు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.అలాగే పోలీస్ రిక్రూట్మెంట్లో గిరిజనుల డిమాండ్లను పరిష్కరించాలని, జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియాన్ని అందుబాటులోకి తేవాలని పేర్కొన్నారు. సింగరేణి ఓపెన్కాస్ట్ ప్రాజెక్టుల్లో స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని, లేబర్ ఆఫీసర్ పాత్రపై విచారణ జరిపాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ శాఖ అధికారిపై వచ్చిన ఆరోపణలు, రేషన్ బియ్యం అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. మిషన్ భగీరథ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని, 2014 నుంచి సింగరేణి డి ఎం ఎఫ్ టి నిధుల ఖర్చులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాధన దుర్వినియోగం, విద్యా, ఉపాధి, వ్యవసాయ రంగాల సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు సమర్పిస్తూ సీపీఐ తరపున ప్రత్యక్ష పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బద్రి సాయికుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.తిరుపతి, మారం శ్రీనివాస్, బోయిరే ప్రకాష్, కౌన్సిల్ సభ్యులు కొదురుపాక మహేష్, వర్కోల్ రాకేష్, ఆత్రం సీతారాం, ముంజం బుద్ధాజీ, చిప్ప దిలీప్, అంబారావు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్ల ముఠా అరెస్ట్

- రూ. 3.5 కోట్ల మోసం గుట్టు రట్టు
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్






**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లాలో సంచలనం సృష్టించిన అంతర్రాష్ట్ర సైబర్ నేరాల కేసులో బీహార్కు చెందిన ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. నేషనల్ ఫెర్టిలైజర్స్ పేరుతో నకిలీ ఫ్రాంచైజీలు, ఆన్లైన్ లోన్ల పేరుతో అమాయకులను మోసం చేస్తున్న ఈ ముఠా గుట్టును ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ శుక్రవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నేషనల్ ఫెర్టిలైజర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో నకిలీ వెబ్సైట్లు సృష్టించి ఫ్రాంచైజీల ఆశ చూపేవారని, రిజిస్ట్రేషన్, లైసెన్స్, సర్వీస్, ట్రేడ్ ట్రాన్స్ఫర్ ఫీజుల పేరుతో బాధితుల నుంచి విడతల వారీగా లక్షల్లో నగదు వసూలు చేసేవారు. అలాగే ఆన్లైన్లో బజాజ్ లోన్ల కోసం వెతికే వారి వివరాలు సేకరించి, ప్రాసెసింగ్ ఫీజుల పేరుతో భారీగా మోసాలకు పాల్పడేవారన్నారు. దేశ వ్యాప్తంగా ఈ నిందితులపై 498 సైబర్ నేరాల ఫిర్యాదులు ఉండగా, ఒక్క తెలంగాణలోనే 90 కేసులు నమోదయ్యాయని అన్నారు. ఇప్పటివరకు సుమారు రూ. 3.5 కోట్ల వరకు ప్రజల నుంచి కాజేశారని తెలిపారు. నిందితుల నుంచి 10 మొబైల్ ఫోన్లు, రూ.70వేల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే వారి బ్యాంకు ఖాతాలు, స్టాక్ మార్కెట్ షేర్లలో ఉన్న రూ.8 లక్షలను జప్తు చేశారన్నారు.

**అరెస్టు అయిన నిందితులు..**

బీహార్ లోని నవాదా జిల్లాకు చెందిన అభిషేక్ కుమార్, ఆశుతోష్ కుమార్, రితేష్ కుమార్, అభినాష్ కుమార్, నలందా జిల్లాకు చెందిన నిషు కుమార్లను అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. ఆన్లైన్లో కనిపించే ఫ్రాంచైజీలు, ఉద్యోగాల, పెట్టుబడుల ప్రకటనలను గుడ్డిగా నమ్మి మోస పోవద్దని ఎస్పీ సూచించారు. సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్లైన్ను సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, జైనథ్ సీఐ జి.శ్రావణ్, ఎస్సైలు పీర్ సింగ్, గౌతం, గోపికృష్ణ, సిబ్బంది త్రిశూల్, రాజేష్, పురుషోత్తం, రవీందర్, సత్యనారాయణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల భద్రతకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

- ఎస్ జీటీయూ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆకుల ప్రభాకర్



**ఉద్యమ కెరటం, హత్నూర:** నల్గొండ జిల్లాలో ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్య ఘటనను సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ (ఎస్జీటీయూ) తీవ్రంగా ఖండిస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుల ప్రభాకర్ తెలిపారు. విద్యార్థులకు విద్యాబోధన చేయడంతో పాటు వారి భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యతను నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యా సంస్థల నిర్వాహకుల భద్రతపై ఇలాంటి ఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ ఘటనను కేవలం ఒక వ్యక్తిపై జరిగిన దాడిగా కాకుండా విద్యా సంస్థల్లో భద్రత, మత్తు పదార్థాల నియంత్రణ, విద్యార్థుల్లో విలువల పెంపు, తల్లిదండ్రుల బాధ్యత, ఉపాధ్యాయుల పట్ల గౌరవం, సమాజంలో నైతిక విలువల పరిరక్షణ వంటి అనేక అంశాలతో ముడిపడిన సామాజిక సమస్యగా ప్రభుత్వం పరిగణించాలని కోరారు. పాఠశాలలు కళాశాలల పరిసరాల్లో మత్తు పదార్థాల విక్రయాలు సరఫరాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వాటి నియంత్రణకు ప్రభుత్వం మరింత కఠినమైన చర్యలు చేపట్టాలని కోరారు.

**తల్లిదండ్రులే తొలి గురువులు..**

పిల్లలకు తల్లిదండ్రులే తొలి గురువులు.. పిల్లలతో ప్రతిరోజూ కొంత సమయం మాట్లాడటం, వారి సమస్యలను తెలుసుకోవడం, వారి ప్రవర్తనలో వస్తున్న మార్పులను గమనించడం, మంచి–చెడు మధ్య తేడాను వివరించడం తల్లిదండ్రుల బాధ్యత. తల్లిదండ్రులకు కూడా శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, పిల్లలతో స్నేహపూర్వకంగా ఎలా మెలగాలి, వారి సమస్యలను ఎలా అర్థం చేసుకోవాలి, డిజిటల్ ప్రపంచం, సోషల్ మీడియా, ఆన్లైన్ పరిచయాలు, తప్పుడు సమాచారం.. ఇతర ప్రతికూల ప్రభావాల నుంచి పిల్లలను ఎలా రక్షించాలనే అంశాలపై నిపుణులతో అవగాహన కల్పించాలని కోరారు. విద్యార్థి తప్పును సరిదిద్దే ఉపాధ్యాయుడిని ప్రతికూలంగా చూడకుండా, విద్యార్థి భవిష్యత్తు కోసం పనిచేసే మార్గదర్శిగా గౌరవించే సంస్కారం విద్యార్థుల్లో పెంపొందించాలని తెలిపారు.

**విద్యా సంస్థల్లో భద్రతను పెంచాలి..**

ప్రతి విద్యా సంస్థలో అవసరమైన మేరకు సీసీ కెమెరాలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే వ్యవస్థలు, భద్రతా ప్రమాణాలు ఏర్పాటు చేయాలి. అలాగే ఉపాధ్యాయులు, సిబ్బందిపై దాడులు, బెదిరింపులను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి వారికి తగిన రక్షణ కల్పించాలి. విద్యార్థులు తమ సమస్యలను ఉపాధ్యాయులు, కౌన్సిలర్లు, తల్లిదండ్రులతో స్వేచ్ఛగా చెప్పుకునే వాతావరణం పాఠశాలల్లో ఉండాలి. సమస్యలను దాచిపెట్టడం కాకుండా వాటిని ముందుగానే గుర్తించి పరిష్కరించే వ్యవస్థను బలోపేతం చేయాలి. పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో మత్తు పదార్థాల నియంత్రణకు ప్రత్యేక నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయాలి. విద్యార్థులకు మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలంటే పుస్తకాల విద్యతో పాటు విలువల విద్య, జీవన నైపుణ్యాలు, మానసిక బలం, సామాజిక బాధ్యత, మానవీయ దృక్పథం కూడా అందించాలని సూచించారు.

# ఘనంగా 'ఏ1' సెలూన్ ప్రారంభోత్సవం

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'ఏ1' సెలూన్ అండ్ హెయిర్ కటింగ్ షాప్' శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి డీసీసీ మాజీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రిబ్బెన్ కట్ చేసి నూతన సెలూన్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు అత్యాధునిక హంగులతో, అందుబాటు ధరల్లో నాణ్యమైన సేవలు అందించడానికి ఈ సెలూన్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. యువత ఇలాంటి స్వయం ఉపాధి రంగాల్లో వ్యాపారాలు ప్రారంభించి రాణించడం సంతోషకరమని పేర్కొన్నారు. సెలూన్ నిర్వాహకులు వ్యాపారంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.




# ముత్నూర్ తండాలో కమ్యూనిటీ కాంటాక్ట్



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముత్నూర్ తండా గ్రామంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి పర్యవేక్షణలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఇచ్చోడ సీఐ సిహెచ్. రమేష్ తెలిపారు. ఇందులో భాగంగా గ్రామంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి ఒక బెల్ట్ షాపుపై చర్యలు చేపట్టారు. అదేవిధంగా 32 ద్విచక్ర వాహనాలు, 3 ఆటో రిక్షాలను తనిఖీ చేసి వాహనాల పత్రాలను పరిశీలించారు. వాహనాల తనిఖీల సందర్భంగా 85 చలానా కేసులను నమోదు చేయగా, నంబర్ ప్లేట్లు లేని 4 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో పాటు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజలతో సత్సంబంధాలు పెంపొందిస్తూ, వారి భద్రతకు భరోసా కల్పించడమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ ముఖ్య ఉద్దేశ్యమని సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ సిఐ నరేష్ కుమార్, ఎస్సైలు ఇమ్రాన్, శ్రీకాంత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మనం వాడుతున్న ప్రోబయోటిక్ ట్యాబ్లెట్లపై ఆసక్తికర అధ్యయనం.. అవి మనకు సరిపోవట.. ఎందుకంటే..




మన జీర్ణవ్యవస్థలో ఉండే సూక్ష్మజీవులు ఆహారం, జీవనశైలి, తరతరాల ఆహారపు అలవాట్లకు అనుగుణంగా మారుతూ ఉంటాయి. అందుకే అందరికీ ఒకే రకమైన ప్రోబయోటిక్ ఉత్పత్తులు సమానంగా పనిచేస్తాయా అనే ప్రశ్న ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకుంది. దేశంలోని వివిధ గిరిజన సముదాయాల గట్ మైక్రోబయోమ్‌ను పరిశీలించిన తాజా పరిశోధనలో ఇప్పటివరకు గుర్తించని కొన్ని బ్యాక్టీరియా జాతులతోపాటు వందలాది స్థానిక బ్యాక్టీరియా స్ట్రైయిన్లు బయటపడటం ఈ అంశంపై కొత్త చర్చకు దారితీసింది. దేశంలోని కొన్ని గిరిజన సముదాయాలకు చెందిన ఆరోగ్యవంతుల గట్ మైక్రోబయోమ్‌ను పరిశోధకులు పరిశీలించారు. ఈ సముదాయాల్లో తరతరాలుగా కొనసాగుతున్న ఆహారపు అలవాట్లు ఒకదానికొకటి భిన్నంగా ఉన్నాయి. కొందరు ఎక్కువగా పాల ఉత్పత్తులు, సంపూర్ణ ధాన్యాలు తీసుకుంటుండగా, మరికొందరి ఆహార విధానాలు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. ఈ పరిశీలనలో ఆహారపు అలవాట్లకు, గట్‌లో నివసించే బ్యాక్టీరియా లక్షణాలకు మధ్య ఆసక్తికరమైన సంబంధం కనిపించింది.

### ఆహారాల్లో తేడాలే కారణం..

తరతరాలుగా కొనసాగుతున్న ఆహారపు అలవాట్లు గట్‌లోని బ్యాక్టీరియాపై ప్రత్యేకమైన ప్రభావాన్ని చూపుతున్నట్లు పరిశోధన సూచించింది. సాధారణంగా కనిపించే బిఫిడోబ్యాక్టీరియం అడోలెసెంటిస్ వంటి బ్యాక్టీరియాలోనూ పాశ్చాత్య దేశాల ప్రజల గట్ నమూనాల్లో అరుదుగా కనిపించే కార్బొహైడ్రేట్ ప్రాసెసింగ్ జన్యువులను గుర్తించారు. అంటే భారతీయుల సంప్రదాయ ఆహారంలో ఉండే కొన్ని పదార్థాలను జీర్ణం చేసుకోవడానికి ఇక్కడి గట్ బ్యాక్టీరియా కాలక్రమేణా ప్రత్యేకంగా అనుకూలించి ఉండే అవకాశం ఉంటుంది. బార్లీ, గోధుమలు, సంప్రదాయ పాల ఉత్పత్తులు వంటి ఆహార పదార్థాలను జీర్ణం చేసుకోవడంలో సహాయపడే కొన్ని ప్రత్యేక లక్షణాలు స్థానిక బ్యాక్టీరియాలో కనిపించినట్లు పరిశోధన వెల్లడించింది. దీని ద్వారా మనం తీసుకునే ఆహారం కేవలం మన శరీరాన్నే కాకుండా, మన గట్‌లో నివసించే సూక్ష్మజీవుల సముదాయాన్ని కూడా ప్రభావితం చేస్తుందని అర్థమవుతోంది. ఇప్పటివరకు మార్కెట్లో లభించే అనేక ప్రోబయోటిక్ ఉత్పత్తుల్లో యూరప్, ఉత్తర అమెరికా వంటి పాశ్చాత్య ప్రాంతాల ప్రజల్లో గుర్తించిన బ్యాక్టీరియా స్ట్రైయిన్లను ఉపయోగిస్తున్నారు. మంచి బ్యాక్టీరియాగా పరిగణించే ఒక స్ట్రైయిన్ ఎక్కడి వ్యక్తి గట్‌లోకి వెళ్లినా ఒకే విధంగా పనిచేస్తుందనే ఆలోచన దీనికి కారణం. అయితే తాజా పరిశోధన ఈ విధానాన్ని మరోసారి ఆలోచించాల్సిన అవసరాన్ని సూచిస్తోంది.

### ప్రోబయోటిక్స్ ఆపేయాలా..

ఒక నిర్దిష్ట ఆహార విధానానికి, గట్ మైక్రోబయోమ్‌కు అనుగుణంగా అభివృద్ధి చెందిన బ్యాక్టీరియా మరో రకమైన ఆహారపు అలవాట్లు ఉన్న వ్యక్తి గట్‌లోకి వెళ్లినప్పుడు అదే స్థాయిలో స్థిరపడవు. అలాగే అక్కడ ఉన్న సూక్ష్మజీవుల సముదాయంతో కలిసి అదే విధంగా పనిచేయవు. అందువల్ల ఒకే రకమైన ప్రోబయోటిక్ అందరికీ సమాన ప్రయోజనం ఇస్తుందనే భావనను పరిశోధన ప్రశ్నిస్తోంది. అయితే దీనర్థం మార్కెట్లో లభించే ప్రోబయోటిక్స్ అన్నింటినీ వెంటనే ఆపేయాలని కాదు. ప్రోబయోటిక్స్ అనే భావనను తిరస్కరించడం కంటే, ఏ బ్యాక్టీరియా స్ట్రైయిన్ ఎవరికి, ఏ ఆహార విధానం ఉన్న వ్యక్తులకు, ఏ గట్ మైక్రోబయోమ్ నేపథ్యంలో ఉపయోగపడుతుందనే అంశంపై మరింత పరిశోధన అవసరమని ఈ పరిశోధన సూచిస్తోంది. భారతీయుల గట్‌కు అనుగుణంగా స్థానిక బ్యాక్టీరియా స్ట్రైయిన్లను గుర్తించి, వాటిపై పరిశోధనలు చేసి, అవసరమైన పరీక్షలు నిర్వహించి ప్రోబయోటిక్ ఉత్పత్తులను అభివృద్ధి చేసే అవకాశం భవిష్యత్తులో పెరుగుతుంది. ముఖ్యంగా భారతీయుల సంప్రదాయ ఆహార విధానాలు, స్థానిక ఆహార పదార్థాలు, గట్‌లో ఇప్పటికే ఉన్న సూక్ష్మజీవుల సముదాయాన్ని పరిగణనలోకి తీసుకుని రూపొందించే విధానాలు మరింత ఉపయోగకరంగా ఉంటాయనే ఆలోచనకు ఈ పరిశోధన బలం చేకూరుస్తోంది.

### ఒక్క ట్యాబ్లెట్ కీలకం కాదు..

గట్ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఒక్క ప్రోబయోటిక్ సప్లిమెంట్‌పైనే ఆధారపడాల్సిన అవసరం లేదని కూడా ఈ అంశం గుర్తుచేస్తోంది. వైవిధ్యమైన, పీచు పదార్థాలు అధికంగా ఉండే సంప్రదాయ ఆహారాన్ని తీసుకోవడం గట్‌లోని సూక్ష్మజీవుల వైవిధ్యానికి అనుకూలంగా ఉంటుంది. ఒక నిర్దిష్ట ప్రోబయోటిక్‌ను కేవలం ప్రకటనలు లేదా మార్కెటింగ్ ఆధారంగా ఎంచుకోవడం కంటే, అవసరం ఉంటే వైద్య నిపుణుల సలహాతో తీసుకోవడం మంచిది. దేశంలోని గిరిజన సముదాయాల గట్ మైక్రోబయోమ్‌పై జరిగిన ఈ పరిశోధన దేశంలో ఇప్పటివరకు పెద్దగా గుర్తించని సూక్ష్మజీవుల వైవిధ్యాన్ని వెలుగులోకి తీసుకు వచ్చింది. భవిష్యత్తులో మరిన్ని స్థానిక బ్యాక్టీరియా స్ట్రైయిన్లపై పరిశోధనలు జరిగితే భారతీయుల ఆహార విధానం, గట్ మైక్రోబయోమ్‌కు అనుగుణంగా ప్రత్యేకంగా రూపొందించిన ప్రోబయోటిక్స్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది. అంటే విదేశాల్లో అభివృద్ధి చేసిన ఒకే రకమైన ప్రోబయోటిక్ అందరికీ సరిపోతుందా అనే ప్రశ్నకు బదులుగా, వ్యక్తి ఆహారం, గట్ మైక్రోబయో మ్‌కు అనుగుణంగా సరైన బ్యాక్టీరియాను ఎంచుకోవడంపై భవిష్యత్తు పరిశోధనలు దృష్టి పెట్టే అవకాశం ఉంటుంది.

# విటమిన్ బి12 లోపంతో ఆందోళన పెరుగుతుందా ? నిపుణులు ఏం చెబుతున్నారంటే..

ఆందోళన, చిరాకు, అలసట వంటి సమస్యలకు ఒత్తిడి లేదా మానసిక ఆరోగ్య పరిస్థితులే కారణమని చాలామంది భావిస్తారు. అయితే శరీరంలో కొన్ని ముఖ్యమైన పోషకాలు లోపించినా ఇలాంటి లక్షణాలు కనిపించే అవకాశం ఉంగుంది. ముఖ్యంగా విటమిన్ బి12 లోపం మెదడు పనితీరు, నాడీ వ్యవస్థ, మానసిక స్థితిపై ప్రభావం చూపిస్తుందని నిపుణులు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో బి12 స్థాయిలు తగ్గడం వల్ల ఆందోళనను పోలిన లక్షణాలు కూడా కనిపిస్తాయి. అయితే ప్రతి వ్యక్తిలో దీని ప్రభావం ఒకేలా ఉండదు. విటమిన్ బి12 నాడులు సక్రమంగా పనిచేయడానికి, మెదడు మధ్య సమాచార మార్పిడికి అవసరమైన న్యూరోట్రాన్స్‌మిటర్ల తయారీలో కీలక పాత్ర పోషిస్తుంది. అందువల్ల శరీరంలో బి12 తగినంతగా లేకపోతే ఆందోళన, చిరాకు, భయాందోళన, మానసిక స్థితిలో మార్పులు, తక్కువ ఉత్సాహం వంటి లక్షణాలు కనిపించే అవకాశం ఉంటుంది. విటమిన్ బి12ని కోబాలమిన్ అని కూడా పిలుస్తారు. ఇది నీటిలో కరిగే విటమిన్. మెదడు పనితీరు, నాడుల ఆరోగ్యం, ఎర్ర రక్త కణాల తయారీ, డీఎన్ఏ నిర్మాణం వంటి అనేక ముఖ్యమైన ప్రక్రియలకు ఇది అవసరం. శరీరం తగినంత బి12ను స్వయంగా తయారు చేసుకోలేకపోవడంతో ఆహారం ద్వారా పొందాలి. చేపలు, గుడ్లు, పాలు, పాల ఉత్పత్తులు, చికెన్, మాంసం వంటి వాటిలో విటమిన్ బి12 లభిస్తుంది.

### నాడీ వ్యవస్థ ఆరోగ్యానికి..

నాడీ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండటంలో విటమిన్ బి12కి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. నరాలపై ఉండే మైలిన్ అనే రక్షణ పొరను నిర్వహించడంలో ఇది సహాయపడుతుంది. ఈ రక్షణ పొర సరిగ్గా ఉంటే మెదడు, వెన్నుపాము, శరీరంలోని ఇతర భాగాల మధ్య విద్యుత్ సంకేతాలు సక్రమంగా ప్రసారం అవుతాయి. బి12 లోపం ఏర్పడినప్పుడు నాడీ వ్యవస్థ పనితీరు దెబ్బతినే అవకాశం ఉంటుంది. ఎర్ర రక్త కణాల తయారీలోనూ బి12 కీలక పాత్ర పోషిస్తుంది. ఈ విటమిన్ లోపిస్తే ఎర్ర రక్త కణాల ఉత్పత్తి ప్రభావితమై మెగాలోబ్లాస్టిక్ అనీమియా వంటి సమస్యలు ఏర్పడతాయి. దాంతో శరీరానికి ఆక్సిజన్ సరఫరా సరిగా జరగక అలసట, బలహీనత, తల తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. మెదడు ఆరోగ్యానికి కూడా బి12 అవసరం. ఈ విటమిన్ స్థాయిలు చాలా తక్కువగా ఉన్నప్పుడు జ్ఞాపకశక్తి తగ్గడం, ఆలోచనా సామర్థ్యంలో మార్పులు, మెదడు మబ్బుగా అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. తీవ్రమైన లోపం ఉన్నప్పుడు మరింత తీవ్రమైన నాడీ సంబంధిత సమస్యలు కూడా ఏర్పడే అవకాశం ఉంటుంది.

### ఆందోళన పెరుగుతుందా..

విటమిన్ బి12 లోపం ఆందోళన లక్షణాలను పెంచడానికి ఒక కారణం అవుతుందని చెబుతున్నారు. శరీరంలో బి12 తక్కువగా ఉన్నప్పుడు మెదడు పనితీరుకు అవసరమైన కొన్ని రసాయన ప్రక్రియలు ప్రభావితమవుతాయి. ముఖ్యంగా హోమోసిస్టీన్ అనే పదార్థాన్ని మెథియోనిన్‌గా మార్చే ప్రక్రియలో బి12 అవసరం. ఈ ప్రక్రియ మెదడు పనితీరు, మానసిక స్థితి నియంత్రణకు సంబంధించిన జీవరసాయన చర్యల్లో భాగం. బి12 లోపం వల్ల అలసట, బలహీనత, మెదడు మబ్బుగా అనిపించడం వంటి సమస్యలు కూడా వస్తాయి. ఇవి రోజువారీ పనితీరుపై ప్రభావం చూపడంతో కొందరిలో ఆందోళన మరింత ఎక్కువగా అనిపించే అవకాశం ఉంటుంది. అలాగే నాడీ వ్యవస్థ పనితీరు దెబ్బతినడం వల్ల చేతులు, కాళ్లలో తిమ్మిర్లు, గుండె వేగంగా కొట్టుకోవడం, తల తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇవి కొన్నిసార్లు పానిక్ అటాక్ లక్షణాలను పోలి ఉంటాయి.

### ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయి..

విటమిన్ బి12 లోపం ఉన్నప్పుడు శారీరక లక్షణాలతోపాటు నాడీ సంబంధిత లక్షణాలు కూడా కనిపిస్తాయి. తీవ్రమైన అలసట, బలహీనత, చర్మం పాలిపోయినట్లు కనిపించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తల తిరగడం వంటి సమస్యలు వస్తాయి. చేతులు, కాళ్లలో తిమ్మిర్లు, సమతుల్యత కోల్పోవడం, జ్ఞాపకశక్తి సమస్యలు, మెదడు మబ్బుగా అనిపించడం వంటి నాడీ సంబంధిత లక్షణాలు కూడా కనిపించే అవకాశం ఉంటుంది. మానసిక ఆరోగ్యానికి సంబంధించి ఆందోళన, చిరాకు, డిప్రెషన్, మూడ్‌లో మార్పులు, ఏకాగ్రత లోపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అయితే ఇలాంటి లక్షణాలు కనిపించిన ప్రతిసారీ బి12 లోపమే కారణమని భావించకూడదు. ఆందోళనకు అనేక ఇతర కారణాలు కూడా ఉంటాయి. కొంతమందిలో విటమిన్ బి12 లోపం వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా పూర్తిగా శాకాహార లేదా వేగన్ ఆహారం తీసుకునేవారిలో బి12 లోపం ఏర్పడే అవకాశం ఉంటుంది. సహజంగా బి12 లభించే మొక్కల ఆధారిత ఆహార పదార్థాలు చాలా తక్కువగా ఉండటం ఇందుకు ఒక కారణం. వయసు పెరిగే కొద్దీ బి12 శోషణ తగ్గే అవకాశం ఉన్నందున వృద్ధుల్లోనూ లోపం కనిపిస్తుంది.

### జీర్ణ వ్యవస్థ సమస్యలు ఉంటే..

జీర్ణవ్యవస్థకు సంబంధించిన సమస్యలు ఉన్నవారిలోనూ ఆహారం నుంచి బి12 శరీరంలోకి శోషించుకోవడం తగ్గుతుంది. అలాగే మెట్‌ఫార్మిన్, ప్రోటాన్ పంప్ ఇన్హిబిటర్స్ వంటి కొన్ని మందులను దీర్ఘకాలం ఉపయోగించే వారు కూడా బి12 స్థాయిలపై వైద్యుల సలహా తీసుకోవాల్సి ఉంటుంది. బి12 లోపం ఉన్నవారికి లోపాన్ని సరిచేయడం వల్ల ప్రయోజనం ఉంటుంది. అయితే బి12 స్థాయిలు సాధారణంగా ఉన్న ప్రతి ఒక్కరూ అదనంగా బి12 సప్లిమెంట్లు తీసుకోవాల్సిన అవసరం లేదు. సాధారణ బి12 స్థాయిలు ఉన్నవారిలో కేవలం సప్లిమెంట్లు తీసుకోవడం ద్వారా ఆందోళన గణనీయంగా తగ్గుతుంది. ఎప్పటికప్పుడు లేదా నిరంతరం ఆందోళనగా అనిపించడం, కారణం తెలియని తీవ్రమైన అలసట, చేతులు లేదా కాళ్లలో తిమ్మిర్లు, జ్ఞాపకశక్తి సమస్యలు, సమతుల్యతలో ఇబ్బందులు వంటి లక్షణాలు ఉంటే విటమిన్ బి12 స్థాయిలను పరీక్షించుకోవడం గురించి వైద్యుడిని సంప్రదించవచ్చు. ముఖ్యంగా దీర్ఘకాలంగా శాకాహార లేదా వేగన్ ఆహారం తీసుకునేవారు బి12 స్థాయిలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.

### వైద్య పరీక్షలు అవసరం..

విటమిన్ బి12 లోపం కొన్ని సందర్భాల్లో ఆందోళనను పోలిన లక్షణాలకు లేదా నాడీ సంబంధిత సమస్యలకు కారణం అవుతుంది. అయితే ఆందోళనకు బి12 లోపమే ఏకైక కారణమని చెప్పలేం. లక్షణాలను బట్టి సరైన వైద్య పరీక్షలు చేయించుకుని అసలు కారణాన్ని గుర్తించడం చాలా ముఖ్యం. బి12 లోపం నిర్ధారణ అయితే వైద్యుల సూచన మేరకు ఆహారం లేదా సప్లిమెంట్ల ద్వారా దాన్ని సరిచేసుకోవాలి.




# భోజనం చేశాక పండ్లను తినాలా.. వైద్య నిపుణులు ఏం చెబుతున్నారు..?



భోజనం తర్వాత పండ్లు తినడం ఆరోగ్యకరమైన అలవాటుగా చాలామంది భావిస్తారు. ముఖ్యంగా మామిడి, యాపిల్, బొప్పాయి వంటి పండ్లను భోజనం అనంతరం స్వీట్లకు ప్రత్యామ్నాయంగా తీసుకోవడం సాధారణం. అయితే భోజనం చేసిన వెంటనే పండ్లు తింటే అవి కడుపులో పులిసిపోయి గ్యాస్, ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యలకు దారితీస్తాయనే వాదనలు తరచూ వినిపిస్తుంటాయి. అయితే ఈ వాదనల్లో వాస్తవం ఎంత? నిజంగా పండ్లను ఎప్పుడు తింటే మంచిది? నిపుణుల సూచనల ప్రకారం ఇలా ఉన్నాయి. భోజనం చేసిన వెంటనే పండ్లు తింటే అవి కడుపులో కుళ్లిపోతాయనే వాదనకు శాస్త్రీయ ఆధారం లేదు. మన కడుపులో హైడ్రోక్లోరిక్ యాసిడ్ ఉంటుంది. దీని ఆమ్లత్వం కారణంగా కడుపులో పండ్లు బ్యాక్టీరియా ద్వారా పులిసిపోయే పరిస్థితి ఉండదు. అయితే పండ్లను కార్బొహైడ్రేట్లు, ప్రోటీన్లు, కొవ్వులు అధికంగా ఉన్న భోజనం తర్వాత తీసుకుంటే కడుపు ఖాళీ కావడానికి కొంత ఎక్కువ సమయం పడుతుంది. ఇది జీర్ణక్రియలో సహజమైన ప్రక్రియే తప్ప, ఏదైనా సమస్యకు సంకేతం కాదు.

### పీచు పదార్థంతో మేలు..

పండ్లలో ఉండే కరిగే పీచు పదార్థం, ముఖ్యంగా యాపిల్, సిట్రస్ పండ్లలో లభించే పెక్టిన్, కడుపు నుంచి ఆహారం బయటకు వెళ్లే వేగాన్ని కొంత తగ్గిస్తుంది. దీని వల్ల ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలుగుతుంది. అలాగే ఆహారంలోని పోషకాలు శరీరంలోకి క్రమంగా శోషించేందుకు ఇది సహాయపడుతుంది. వేగంగా రక్తంలో చక్కెర పెరగకుండా కూడా పీచు కొంతవరకు సహకరిస్తుంది. అయితే భోజనంతోపాటు లేదా వెంటనే పండ్లు తినడం వల్ల ప్రతి ఒక్కరికీ ఒకే విధమైన అనుభవం ఉండదు. ఖాళీ కడుపుతో పండ్లు తింటే వాటిలోని సహజ చక్కెరలు చిన్న ప్రేగులకు వేగంగా చేరుతాయి. భోజనం తర్వాత పండ్లు తింటే ప్రధాన ఆహారంలోని పీచు, ప్రోటీన్, కొవ్వు కారణంగా జీర్ణక్రియ కొంత నెమ్మదిస్తుంది. ఫలితంగా ఎక్కువసేపు ఆకలి వేయకుండా ఉండటానికి ఇది సహాయపడుతుంది. రక్తంలో చక్కెర స్థాయిల విషయంలోనూ పండ్లను భోజనంతో కలిపి తీసుకోవడం కొందరికి ప్రయోజనకరంగా ఉంటుంది. ముఖ్యంగా టైప్-2 మధుమేహం లేదా ఇన్సులిన్ నిరోధకత ఉన్నవారు పండ్లను ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉన్న ఆహారంతో కలిపి తీసుకుంటే రక్తంలో చక్కెర ఒక్కసారిగా పెరగకుండా కొంత నియంత్రణలో ఉండే అవకాశం ఉంటుంది. అయితే వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులను బట్టి ఆహార ఎంపికలు మారుతాయి.

### సున్నితమైన జీర్ణ వ్యవస్థ ఉంటే..

మరోవైపు సున్నితమైన జీర్ణవ్యవస్థ ఉన్నవారికి మాత్రం భోజనం చేసిన వెంటనే ఎక్కువ మొత్తంలో పండ్లు తినడం అసౌకర్యాన్ని కలిగిస్తుంది. ముఖ్యంగా పుచ్చకాయ, బేరి, ద్రాక్ష వంటి ఫ్రక్టోజ్ అధికంగా ఉండే పండ్లను ఇప్పటికే నిండుగా ఉన్న కడుపుపై ఎక్కువ పరిమాణంలో తీసుకుంటే గ్యాస్, పొట్ట ఉబ్బరం, అసౌకర్యం వంటివి కనిపిస్తాయి. ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ (IBS) ఉన్నవారిలో ఈ సమస్య మరింత స్పష్టంగా ఉంటుంది. భోజనంతో పాటు పండ్లు తీసుకోవడం వల్ల మరో ప్రయోజనం కూడా ఉంటుంది. విటమిన్ సి అధికంగా ఉండే నారింజ, జామ, కివీ వంటి పండ్లు పప్పులు, పాలకూర, సంపూర్ణ ధాన్యాల్లో ఉండే మొక్కల ఆధారిత ఇనుము శరీరంలో శోషించేందుకు సహాయపడతాయి. అందువల్ల కొన్ని సందర్భాల్లో ప్రధాన భోజనంతో పండ్లు తీసుకోవడం పోషకాల శోషణకు ఉపయోగకరంగా ఉంటుంది. పండ్లు తినడానికి ఒకే ఒక్క ఉత్తమ సమయం అంటూ కచ్చితమైన నియమం లేదు. పండ్లను ఎప్పుడు తింటున్నామన్న దానికంటే రోజువారీ ఆహారంలో వాటిని తగిన పరిమాణంలో చేర్చుకోవడం ముఖ్యం. భోజనం తర్వాత పండ్లు తిన్నప్పుడు బరువుగా లేదా పొట్ట ఉబ్బరంగా అనిపిస్తే, వాటిని భోజనం తర్వాత ఒకటి నుంచి రెండు గంటల విరామంతో తీసుకోవచ్చు. ఉదయం 11 గంటల సమయంలో లేదా సాయంత్రం 4 గంటల సమయంలో చిరుతిండిగా తీసుకోవడం కూడా ఒక ఎంపిక.

### ఏ సమయంలో తినాలి..

పండ్లను ఎక్కువ పరిమాణంలో ఒకేసారి తినకుండా తగిన మోతాదులో తీసుకోవడం మంచిది. ఉదాహరణకు చిన్న యాపిల్ లేదా కొద్దిగా బెర్రీలు సరిపోతాయి. ముఖ్యంగా అధిక కేలరీల భోజనం చేసిన వెంటనే పెద్ద గిన్నె నిండా పండ్లు తినడం అవసరం లేదు. పండ్ల రసాల కంటే సంపూర్ణ పండ్లకు ప్రాధాన్యం ఇవ్వడం మంచిది. పండ్లను రసంగా మార్చినప్పుడు పీచు పదార్థంలో కొంత భాగం తొలగిపోతుంది. దీంతో సహజ చక్కెరలు శరీరంలోకి వేగంగా చేరే అవకాశం ఉంటుంది. సంపూర్ణ పండ్లలోని పీచు జీర్ణక్రియను నియంత్రించడంలో, రక్తంలో చక్కెర వేగంగా పెరగకుండా చూడడంలో సహాయపడుతుంది. గ్యాస్ట్రో-ఈసోఫేజియల్ రిఫ్లక్స్ (+జు=ణ) సమస్య ఉన్నవారు కూడా పండ్ల ఎంపిక, సమయంపై కొంత జాగ్రత్త వహించాలి. ముఖ్యంగా రాత్రి ఆలస్యంగా నారింజ, నిమ్మ వంటి సిట్రస్ పండ్లు తీసుకోవడం వల్ల కొందరిలో యాసిడ్ రిఫ్లక్స్ లక్షణాలు పెరిగే అవకాశం ఉంటుంది. ఆరోగ్యంగా ఉన్న చాలా మందికి భోజనం చేసిన వెంటనే పండ్లు తినడం హానికరం కాదు. పండ్లు కడుపులో కుళ్లిపోవడం లేదా పులిసిపోవడం వల్ల జీర్ణక్రియ దెబ్బతింటుందనే వాదనకు ఆధారం లేదు. అయితే సున్నితమైన జీర్ణవ్యవస్థ, తరచూ పొట్ట ఉబ్బరం వంటి సమస్యలు ఉన్నవారు భోజనం తర్వాత ఒకటి నుంచి రెండు గంటల విరామంతో పండ్లు తీసుకోవడం ద్వారా అసౌకర్యాన్ని తగ్గించుకోవచ్చు. చివరికి పండ్లను ఏ సమయంలో తింటున్నామన్న దానికంటే, వాటిని సరైన పరిమాణంలో, సంపూర్ణ రూపంలో తీసుకోవడం, మన శరీరం ఎలా స్పందిస్తుందో గమనించడం మరింత ముఖ్యమైన విషయమని నిపుణులు చెబుతున్నారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**

# రెండో టెస్టుకు లంక కొత్త అస్త్రాలు

## జట్టులోకి మిషారా, ఆరాచ్చిగే

- గాయాలతో ముగ్గురు కీలక ఆటగాళ్లు దూరం
- మెండిస్, నిస్సాంక, చాండిమాల్‌కు విశ్రాంతి
- తొలి టెస్టు ఓటమికి బదులు తీర్చుకోవాలని లంక
- సిరీస్ క్లీన్‌స్వీప్‌పై భారత్ కన్ను



**కొలంబో:** భారత్‌తో జరిగే రెండో టెస్టుకు శ్రీలంక కీలక మార్పులతో సిద్ధమవుతోంది. గాయాలతో పలువురు ప్రధాన ఆటగాళ్లు దూరం కావడంతో దేశవాళీ క్రికెట్‌లో సత్తా చాటుతున్న కమీల్ మిషారా, సహన్ ఆరాచ్చిగేలను జట్టులోకి తీసుకుంది. ఆగస్టు 23 నుంచి కొలంబోలోని సింహాలీస్ స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో రెండో టెస్టు ప్రారంభం కానుంది. తొలి టెస్టులో భారత్ చేతిలో 165 పరుగుల తేడాతో ఓటమిపాలైన శ్రీలంకకు రెండో టెస్టుకు ముందు గాయాలు పెద్ద సమస్యగా మారాయి. కుశాల్ మెండిస్ గాయం కారణంగా దూరం కాగా, పాథుమ్ నిస్సాంక పూర్తిస్థాయిలో కోలుకోలేదు. గాలే టెస్టులో కన్‌కషన్‌కు గురైన దినేశ్ చాండిమాల్ కూడా రెండో టెస్టుకు అందుబాటులో ఉ ండటం లేదు. కీలక బ్యాటర్లు ముగ్గురు దూరం కావడంతో శ్రీలంక బ్యాటింగ్ విభాగంపై ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో దేశవాళీ క్రికెట్‌లో మంచి ఫామ్‌లో ఉన్న కమీల్ మిషారా, సహన్ ఆరాచ్చిగేలను సెలెక్టర్లు జట్టులోకి తీసుకున్నారు. పరిస్థితులను బట్టి వీరిద్దరిలో ఒకరికి లేదా ఇద్దరికీ తుది జట్టులో చోటు దక్కే అవకాశముంది. భారత్ వంటి బలమైన ప్రత్యర్థిపై అవకాశం లభిస్తే తమ ప్రతిభను నిరూపించుకునేందుకు వారికి ఇదో కీలక వేదిక కానుంది. గాలేలో జరిగిన తొలి టెస్టులో శుభ్‌మన్ గిల్ నాయకత్వంలోని భారత్ అన్ని విభాగాల్లో ఆధిపత్యం ప్రదర్శించింది. దీంతో రెండు టెస్టుల సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించింది. ఇప్పుడు కొలంబోలోనూ అదే జోరు కొనసాగించి సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేయాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. మరోవైపు సొంతగడ్డపై సిరీస్ పరాజయాన్ని తప్పించుకోవాలంటే శ్రీలంకకు రెండో టెస్టులో విజయం తప్పనిసరిగా మారింది. ధనంజయ డి సిల్వా నాయకత్వంలోని శ్రీలంక జట్టులో లహిరు ఉదారా, కమీల్ మిషారా, పసిందు సూరియబండారా, కమిందు మెండిస్, సహన్ ఆరాచ్చిగే, సోనల్ దినూషా, నిరోషన్ డిక్వెల్లా, కేశర నువాన్థా, ప్రభాత్ జయసూర్య, మిలన్ రత్నాయకే, లహిరు కుమార, అసిత ఫెర్నాండో, విశ్వ ఫెర్నాండో చోటు దక్కించుకున్నారు. కీలక ఆటగాళు లేకుండానే భారత్‌ను నిలువరించాల్సిన పరిస్థితి రావడంతో కొలంబో టెస్టు శ్రీలంకకు అసలైన పరీక్షగా మారనుంది.




# 15 ఏళ్ల నిరీక్షణకు తెర!

## ప్రపంచ బ్యాడ్మింటన్‌లో గాయత్రి-త్రీసా సంచలనం

- నాలుగో సీడ్ చైనా జోడీకి షాక్
- మూడు గేమ్‌ల పోరులో అద్భుత విజయం
- మహిళల డబుల్స్‌లో పతకం ఖాయం
- జ్వాల-అశ్విని తర్వాత రెండో భారత జోడీ

**న్యూఢిల్లీ:** ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత యువ షట్లర్లు గాయత్రి గోపిచంద్-త్రీసా జాలీ చరిత్ర సృష్టించారు. మహిళల డబుల్స్‌లో అద్భుత ప్రదర్శనతో దూసుకెళ్తున్న భారత జోడీ.. నాలుగో సీడ్ చైనా ద్వయాన్ని మట్టికరిపించి పతకాన్ని ఖాయం చేసింది. తద్వారా మహిళల డబుల్స్‌లో భారత్‌కు 15 ఏళ్లుగా కొనసాగుతున్న పతక నిరీక్షణకు తెరదించింది. శుక్రవారం జరిగిన కీలక పోరులో చైనాకు చెందిన జియా యి ఫాన్-జాంగ్ షు షియాన్ జోడీతో గాయత్రి-త్రీసా అమీతుమీ తేల్చుకున్నారు. హోరాహోరీగా సాగిన తొలి గేమ్‌ను భారత జోడీ 16-21తో కోల్పోయింది. అయితే ఆ తర్వాత ఏమాత్రం ఒత్తిడికి లోనుకాకుండా అద్భుతంగా పుంజుకుంది. రెండో గేమ్‌లో దూకుడు పెంచి 21-15తో చైనా జోడీని చిత్తు చేసి మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లింది. మూడో గేమ్‌లో భారత అమ్మాయిల జోరు ముందు చైనా జోడీ నిలువలేకపోయింది. ఆరంభం నుంచే ఆధిపత్యం ప్రదర్శించిన గాయత్రి-త్రీసా 21-13తో గేమ్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకున్నారు. నాలుగో సీడ్ జోడీని ఓడించి ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పతకాన్ని ఖాయం చేసుకున్నారు. ఈ విజయంతో భారత మహిళల డబుల్స్ బ్యాడ్మింటన్‌లో గాయత్రి-త్రీసా కొత్త అధ్యాయం లిఖించారు. 2011లో జ్వాలా గుత్తా-అశ్విని పొన్నప్ప జోడీ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించింది. ఆ తర్వాత మహిళల డబుల్స్‌లో భారత్‌కు మరో పతకం దక్కలేదు. ఇప్పుడు 15 ఏళ్ల తర్వాత గాయత్రి-త్రీసా ఆ నిరీక్షణకు తెరదించారు. అంతకుముందు కూడా భారత జోడీ సంచలన ప్రదర్శన చేసింది. వరుసగా ఉన్నత సీడ్ జోడీలను ఇంటిముఖం పట్టిస్తూ పతక పోరుకు చేరింది. కీలక సమయంలో ఒత్తిడిని అధిగమిస్తూ గాయత్రి-త్రీసా కనబరిచిన పోరాట పటిమ భారత బ్యాడ్మింటన్‌లో మరో చారిత్రక విజయానికి బాటలు వేసింది.

# యూఎస్ ఓపెన్‌లో కనకవర్షం!

- చరిత్రలోనే భారీ ప్రైజ్‌పూల్
- మొత్తం పరిహారం రూ.వెయ్యి కోట్లకు చేరువ
- సింగిల్స్ విజేతకు రూ.52.65 కోట్లు
- ఆగస్టు 23 నుంచి గ్రాండ్‌స్లామ్ సమరం
- అల్కరాజ్ పునరాగమనంపై అందరి చూపు



**న్యూయార్క్:** టెన్నిస్ ప్రపంచంలో అత్యంత ప్రతిష్టాత్మక గ్రాండ్‌స్లామ్‌లలో ఒకటైన యూఎస్ ఓపెన్-2026 రికార్డు స్థాయి ప్రైజ్‌మనీతో సరికొత్త చరిత్రకు సిద్ధమైంది. ఈసారి ఆటగాళ్లకు అందించే మొత్తం పరిహారాన్ని 108 మిలియన్ డాలర్లకు పెంచారు. గ్రాండ్‌స్లామ్ టోర్నీల చరిత్రలోనే ఇది భారీ మొత్తంగా నిలవనుంది. 2024తో పోలిస్తే ఏకంగా 44 శాతం పెరుగుదల నమోదైంది. పురుషుల, మహిళల సింగిల్స్ ఛాంపియన్లకు భారీ నజరానా ఎదురుచూస్తోంది. ఒక్కో సింగిల్స్ విజేతకు సుమారు రూ.52.65 కోట్ల నగదు బహుమతి దక్కనుంది. గత ఏడాదితో పోలిస్తే విజేతలకు అందించే ప్రైజ్‌మనీని 10 శాతం పెంచారు. దీంతో టైటిల్‌తో పాటు భారీ చెక్కు కోసం కూడా అగ్రశ్రేణి ఆటగాళ్ల మధ్య హోరాహోరీ పోరు జరగనుంది. యునైటెడ్ స్టేట్స్ టెన్నిస్ అసోసియేషన్ ఈ భారీ ప్రైజ్‌మనీ వివరాలను ప్రకటించింది. ఆటగాళ్లపై పెట్టుబడులను మరింత పెంచే దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఆటగాళ్లు, అభిమానులు, భాగస్వాములకు యూఎస్ ఓపెన్‌ను మరింత విలువైన వేదికగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వెల్లడించారు. యూఎస్ ఓపెన్ ప్రధాన పోటీలు ఆగస్టు 23న ప్రారంభం కానున్నాయి. సెప్టెంబర్ 13న పురుషుల సింగిల్స్ ఫైనల్‌తో టోర్నీ ముగియనుంది. ప్రపంచ అగ్రశ్రేణి ఆటగాళ్లు బరిలోకి దిగనుండటంతో టెన్నిస్ అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. మరోవైపు స్పెయిన్ స్టార్ కార్లోస్ అల్కరాజ్‌పైనా అందరి దృష్టి కేంద్రీకృతమైంది. మణికట్టు గాయం కారణంగా కొంతకాలంగా పోటీ టెన్నిస్‌కు దూరంగా ఉన్న అల్కరాజ్ యూఎస్ ఓపెన్‌తో పునరాగమనం చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. గాయం నుంచి కోలుకుని అతడు ఏ స్థాయిలో రాణిస్తాడన్నది ఆసక్తికరంగా మారింది. రికార్డు ప్రైజ్‌మనీ.. ప్రపంచ అగ్రశ్రేణి ఆటగాళ్ల పోరు.. టైటిల్ కోసం ఉత్కంఠభరిత సమరం.. ఇలా యూఎస్ ఓపెన్-2026 టెన్నిస్ అభిమానులకు భారీ విందుగా మారనుంది.

# ఫిఫా మహిళల ప్రపంచకప్ షెడ్యూల్ విడుదల

- బ్రెజిల్‌లో మహిళల ఫుట్‌బాల్ సమరం
- ఎనిమిది నగరాల్లో 64 మ్యాచ్‌లు
- 2027 జూన్ 24న బ్రెజిల్ తొలి పోరు
- జూలై 25న మరాకానాలో మహా ఫైనల్
- తొలిసారి దక్షిణ అమెరికా గడ్డపై మెగా టోర్నీ

**జ్యూరిచ్:** ఫుట్‌బాల్ అభిమానులకు మరో మహా సమరానికి రంగం సిద్ధమైంది. బ్రెజిల్ వేదికగా జరిగే 2027 ఫిఫా మహిళల ప్రపంచకప్ షెడ్యూల్‌ను ఫిఫా గురువారం విడుదల చేసింది. దక్షిణ అమెరికా గడ్డపై తొలిసారిగా మహిళల ప్రపంచకప్ జరగనుండటంతో ఈ మెగా టోర్నీపై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. బ్రెజిల్‌లోని ఎనిమిది ప్రధాన నగరాల్లో మొత్తం 64 మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్‌లో ఉన్న ఫిఫా ప్రధాన కార్యాలయంలో ప్లేఆఫ్ టోర్నమెంట్ ప్రాథమిక దశ డ్రా సందర్భంగా మ్యాచ్‌ల షెడ్యూల్‌ను ప్రకటించారు. ఆతిథ్య బ్రెజిల్ తన తొలి మ్యాచ్‌ను జూన్ 24న రియో డి జనీరోలోని ప్రఖ్యాత మరాకానా స్టేడియంలో ఆడనుంది. జూలై 4న బ్రెసిలియాలో బ్రెజిల్ తన చివరి గ్రూప్ మ్యాచ్‌లో బరిలోకి దిగనుంది. ప్రపంచకప్ మ్యాచ్‌లను బ్రెజిల్‌లోని 8నగరాల్లో నిర్వహించనున్నారు. రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌లకు బ్రెసిలియా, పోర్టో అలెగ్రే, రెస్సిఫె, సాల్వడార్ ఆతిథ్యం ఇవ్వనున్నాయి. క్వార్టర్ ఫైనల్ పోరాటాలు బెలో హోరిజోంటే, ఫోర్టలేజాతో పాటు రియో డి జనీరో, సావోపాలో నగరాల్లో జరగనున్నాయి. సావోపాలోలో ఒక సెమీఫైనల్‌తో పాటు మూడో స్థానం కోసం జరిగే మ్యాచ్‌ను నిర్వహించనున్నారు. మరో సెమీఫైనల్‌తో పాటు జూలై 25న జరిగే టైటిల్ పోరుకు మరాకానా స్టేడియం వేదిక కానుంది. 2027 మహిళల ప్రపంచకప్ ఫైనల్‌కు ఆతిథ్యం ఇవ్వడం ద్వారా మరాకానా స్టేడియం అరుదైన రికార్డును సొంతం చేసుకోనుంది. పురుషుల ప్రపంచకప్ ఫైనల్‌తో పాటు మహిళల ప్రపంచకప్ ఫైనల్‌కు కూడా వేదికైన మూడో స్టేడియంగా నిలవనుంది. గతంలో స్వీడన్‌లోని రసుండా స్టేడియం, అమెరికాలోని రోజ్‌బౌల్ మాత్రమే ఈ ఘనత సాధించాయి. ప్రపంచకప్ జరిగే సమయంలో బ్రెజిల్ వ్యాప్తంగా ఫిఫా అభిమానుల ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఫిఫా అధ్యక్షుడు గియాని ఇన్‌ఫాంటినో తెలిపారు. స్టేడియాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా అభిమానులు ప్రపంచకప్ సంబరాలను ఆస్వాదించేలా ఏర్పాట్లు చేయనున్నట్లు వెల్లడించారు.




# సింధు కథ ముగిసె.. డబుల్స్‌పైనే పతక ఆశలు!






**న్యూఢిల్లీ:** ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు పోరాటం ప్రిక్వార్టర్ ఫైనల్లోనే ముగిసింది. ఆరో ప్రపంచ చాంపియన్‌షిప్ పతకమే లక్ష్యంగా బరిలోకి దిగిన సింధు.. మూడో ర్యాంకర్, చైనా షట్లర్ వాంగ్ జి యి చేతిలో హోరాహోరీ పోరులో ఓటమి పాలైంది. పురుషుల సింగిల్స్‌లో సంచలన విజయంతో అందరి దృష్టిని ఆకర్షించిన యువ షట్లర్ ఆయుష్ శెట్టి కూడా ప్రిక్వార్టర్స్‌లోనే ఇంటిదారి పట్టాడు. దీంతో సింగిల్స్‌లో భారత పోరు ముగిసింది. అయితే మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపిచంద్-త్రీసా జాలీ, పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి క్వార్టర్ ఫైనల్‌కు చేరి పతక ఆశలను సజీవంగా ఉంచారు.

### పోరాడి ఓడిన సింధు

కెరీర్‌లో 11వసారి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో బరిలోకి దిగిన సింధు.. ప్రిక్వార్టర్స్‌లో వాంగ్ జి యి చేతిలో 11-21, 21-15, 17-21 తేడాతో ఓడిపోయింది. దాదాపు గంటన్నరపాటు సాగిన పోరులో తొలి గేమ్‌ను కోల్పోయిన సింధు రెండో గేమ్‌లో అద్భుతంగా పుంజుకుంది. నెట్ గేమ్, క్రాస్‌కోర్ట్ స్మాష్‌లతో చెలరేగి మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లింది. మూడో గేమ్‌లోనూ సింధు ఒక దశలో 13-10 ఆధిక్యంలో నిలిచింది. అయితే వాంగ్ సుదీర్ఘ ర్యాలీలతో పుంజుకుని 15-15తో స్కోరును సమం చేసింది. కాళ్ల కండరాల నొప్పితో ఇబ్బంది పడుతున్నప్పటికీ చైనా షట్లర్ పోరాటం కొనసాగించింది. చివరి దశలో సింధు చేసిన తప్పిదాలను సద్వినియోగం చేసుకున్న వాంగ్ మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. వాంగ్ చేతిలో సింధుకు ఇది ఆరో ఓటమి.

### ఆయుష్ జోరుకు బ్రేక్

పురుషుల సింగిల్స్‌లో 21 ఏళ్ల ఆయుష్ శెట్టి పోరాటం కూడా ప్రిక్వార్టర్స్‌లో ముగిసింది. తొలి రౌండ్‌లో ప్రపంచ నంబర్‌వన్, డిఫెండింగ్ చాంపియన్ షి యుచిని ఓడించి సంచలనం సృష్టించిన ఆయుష్.. ప్రిక్వార్టర్స్‌లో ఇండోనేషియాకు చెందిన అల్వీ ఫర్హాన్ చేతిలో 19-21, 11-21తో వరుస గేమ్‌ల్లో ఓడిపోయాడు. తొలి గేమ్‌లో గట్టిపోటీ ఇచ్చిన ఆయుష్ రెండో గేమ్‌లో మాత్రం ప్రత్యర్థి జోరును అడ్డుకోలేకపోయాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో జోడీ కూడా నిరాశపరిచింది. చైనాకు చెందిన గువో జిన్‌వా-చెన్ ఫాంగ్‌హుయ్ జోడీ చేతిలో 16-21, 5-21తో ఓటమి పాలైంది.

### సాత్విక్-చిరాగ్ థ్రిల్లింగ్ విక్టరీ

పురుషుల డబుల్స్‌లో భారత స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ఉత్కంఠ పోరులో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఐదో సీడ్ భారత ద్వయం 21-23, 21-19, 21-17తో మలేషియాకు చెందిన జునైదీ ఆరిఫ్-యాప్ రాయ్ కింగ్ జోడీని ఓడించింది. గంటా 22 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో తొలి గేమ్‌ను తృటిలో చేజార్చుకున్న సాత్విక్-చిరాగ్ ఆ తర్వాత అద్భుతంగా పుంజుకున్నారు. వరుసగా రెండు గేమ్‌లు గెలిచి క్వార్టర్స్ బెర్త్‌ను ఖాయం చేసుకున్నారు.

### గాయత్రి-త్రీసా మరో సంచలనం

మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపిచంద్-త్రీసా జాలీ జోడీ సంచలన ప్రదర్శన కొనసాగించింది. ప్రిక్వార్టర్స్‌లో ఏడో ర్యాంక్ జపాన్ జోడీ రిన్ ఇవానాగా-కీ నకానిషిని 21-16, 21-12తో వరుస గేమ్‌ల్లో చిత్తు చేసింది. ఆరంభం నుంచే మ్యాచ్‌పై ఆధిపత్యం చెలాయించిన భారత జోడీ ప్రత్యర్థులకు పుంజుకునే అవకాశమే ఇవ్వలేదు. గాయం నుంచి కోలుకుని తిరిగి వచ్చిన త్రీసా.. గాయత్రితో కలిసి అద్భుత సమన్వయంతో ఆడింది. ఈ విజయంతో భారత జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లి పతకానికి మరింత చేరువైంది. సింగిల్స్‌లో భారత ఆశలు ముగిసిన నేపథ్యంలో ఇప్పుడు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత పతక ఆశలు ప్రధానంగా గాయత్రి-త్రీసా, సాత్విక్-చిరాగ్ జోడీలపైనే నిలిచాయి.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక





# హాయ్ చిత్రం ట్రైలర్ విడుదల

లేడీ సూపర్ స్టార్ నయనతార, టాలెంటెడ్ యంగ్ హీరో కవిన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న రొమాంటిక్ డ్రామా మూవీ 'హాయ్'. ప్రముఖ గీత రచయిత విష్ణు ఎడవన్ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఆగస్టు 28న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున థియేటర్లలో విడుదల కాబోతుండగా తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. తమిళంతో పాటు తెలుగు ట్రైలర్‌ను వదిలింది. ఈ ట్రైలర్ ఫుల్ లవ్, ఫన్ మరియు ఎమోషన్స్‌తో ఆకట్టుకునేలా ఉంది. ప్రేమ వివాహాల కోసం ప్రయత్నించి విఫలమయ్యే సామాన్యుడిగా కవిన్ ఇందులో కనిపించగా, ఆయనకు దేవసేన పాత్రలో నటిస్తున్న నయనతార ఎదురుకావడం జరుగుతుంది. సంప్రదాయాలకు భిన్నంగా ఉండే ఒక స్వతంత్ర భావాలున్న మహిళగా నయనతార లుక్ చాలా ఆకర్షణీయంగా ఉంది. అనుకోని పరిస్థితుల నేపథ్యంలో వీరిద్దరికీ పెళ్లి జరగడం, ఆ తర్వాత వారి మధ్య జరిగే మనస్పర్థలు, భావోద్వేగాలు ఈ సినిమా ప్రధాన కథాంశంగా ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. కవిన్, నయనతార ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీ చాలా ఫ్రెష్‌గా ఉండి సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఇక ఈ చిత్రంలో నయనతార, కవిన్‌లతో పాటు కే. భాగ్యరాజ్, ప్రభు, రాధికా శరత్‌కుమార్ వంటి దిగ్గజ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాకు జెన్ మార్టిన్ సంగీతం అందిస్తుండగా, రాజేష్ శుక్లా సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తించారు. జి స్టూడియోస్ సౌత్, రౌడీ పిక్చర్స్ మరియు సెవెన్ స్క్రీన్ స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించాయి.

# ఆదిత్యరాయ్ మూవీలో భాగ్యశ్రీభోర్సే

## వార్తలను తోసిపుచ్చిన టీ సీరిస్

టాలీవుడ్‌లో తన అందం, నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సేకు సంబంధించిన ఓ బాలీవుడ్ వార్త తాజాగా ఆసక్తికరంగా మారింది. బాలీవుడ్ స్టార్ హీరో ఆదిత్య రాయ్ కపూర్, దర్శకుడు మిలాప్ జవేరీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ యాక్షన్ లవ్‌స్టోరీలో భాగ్యశ్రీ హీరోయిన్‌గా ఎంపికైందంటూ గత కొద్దిరోజులుగా జోరుగా ప్రచారం జరిగింది. అయితే ఈ వార్తలపై తాజాగా బాలీవుడ్ నిర్మాణ సంస్థ టీ-సిరీస్ స్పందించింది. ఈ ప్రచారాన్ని టీ-సిరీస్ ప్రతినిధులు అధికారికంగా ఖండించారు. ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోందన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. సినిమాలో హీరోయిన్‌గా ఎవరు నటించబోతున్నారనే విషయాన్ని త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తామని తెలిపారు. ఆదిత్య రాయ్ కపూర్, మిలాప్ జవేరీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ఈ ప్రాజెక్ట్‌పై ప్రస్తుతం భారీ అంచనాలు ఉన్నాయి. ప్రేమ, యాక్షన్, ఎమోషన్స్ మేళవింపుతో ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు దర్శకుడు మిలాప్ జవేరీ గతంలో వెల్లడించారు. ప్రేమకథలను తెరకెక్కించడంలో తనదైన శైలిని చూపించిన మిలాప్ జవేరీ.. 'మర్జావాన్', 'ఏక్ దివానే కీ దివానియత్' వంటి సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్నారు. ఈసారి ఆదిత్య రాయ్ కపూర్‌తో మరింత ఇంటెన్స్ లవ్‌స్టోరీని తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. భాగ్యశ్రీ బోర్సేకు బాలీవుడ్ కొత్తేమీ కాదు. 'యారియాన్ 2', 'చందు ఛాంపియన్' వంటి చిత్రాల్లో చిన్న పాత్రల్లో కనిపించిన ఆమె.. హీరోయిన్‌గా మాత్రం ఇప్పటివరకు పెద్ద ప్రాజెక్ట్‌లో అవకాశం దక్కించుకోలేదు. ఆదిత్య రాయ్ కపూర్ సినిమా ద్వారా బాలీవుడ్‌లో హీరోయిన్‌గా గ్రాండ్ ఎంట్రీ ఇస్తుందంటూ వచ్చిన వార్తలు కూడా ఇప్పుడు అవాస్తవంగా తేలాయి. భాగ్యశ్రీ బోర్సే రవితేజ నటించిన 'మిస్టర్ బచ్చన్' సినిమాతో టాలీవుడ్‌లోకి హీరోయిన్‌గా అడుగుపెట్టింది. తొలి సినిమాతోనే తన గ్లామర్‌తో పాటు నటనతోనూ తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ తర్వాత వరుస అవకాశాలు ఆమె తలుపు తట్టాయి. దుల్కర్ సల్మాన్, రానా దగ్గుబాటి, సముద్రఖని కీలక పాత్రల్లో నటించిన తమిళ చిత్రం 'కాంత' లోనూ భాగ్యశ్రీ నటించింది. ఈ సినిమాలో ఆమె నటనకు మంచి స్పందన లభించింది. అక్కినేని అఖిల్ నటించిన 'లెనిన్' చిత్రంలోనూ భాగ్యశ్రీ హీరోయిన్‌గా కనిపించింది. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో శివ కార్తికేయన్ సరసన కమల్ హాసన్ నిర్మాణంలో తెరకెక్కుతున్న 'సేయోన్' సినిమాలో నటిస్తోంది.



# నటి షావుకారు జానకి మృతి

## వయోసంబంధ అస్వస్థతో కన్నుమూత.. షావుకారు సినిమాతో పేరు స్థిరం



తెలుగు చిత్రపరిశ్రమలో విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి కన్నుమూశారు. వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యల కారణంగా శుక్రవారం ఆమె మృతి చెందారు. షావుకారు జానకి ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబసభ్యులు ఆమెను చెన్నైలోని కావేరి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 94 ఏళ్ల వయసులో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఆమె తుది శ్వాస విడిచారు. షావుకారు జానకి మరణంపై నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. షావుకారు జానకి భౌతికకాయాన్ని శుక్రవారం సాయంత్రం 5 గంటలనుంచి తేనామ్‌పేట్‌లోని సెనోటాఫ్ రోడ్‌లో.. అభిమానులు, స్నేహితులు, చిత్ర పరిశ్రమకు చెందిన వారు నివాళులు అర్పించటం కోసం ఉంచుతామని తెలిపారు. టేకుమళ్ల జానకి 1931 డిసెంబర్ 12వ తేదీన తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో జన్మించారు. విజయవారి 'షావుకారు' సినిమాతో 1950లో జానకి సినీరంగ ప్రవేశం చేశారు. మొదటి సినిమా పేరునే తన ఇంటి పేరుగా మార్చుకున్నారు. 'షావుకారు' జానకిగా పాపులర్ అయ్యారు. జానకి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో దాదాపు 380 చిత్రాలలో నటించారు. ఆమె చివరగా 2023లో వచ్చిన 'అన్నీ మంచి శకునములే' సినిమాలో కనిపించారు. భారతీయ చలనచిత్ర పరిశ్రమ మరో గొప్ప దిగ్గజాన్ని కోల్పోయింది. నాలుగు తరాల ప్రేక్షకులను తన అద్భుతమైన అభినయంతో మంత్రముగ్ధులను చేసారు. వయోభారంతో పాటు శ్వాసకోశ సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు కొద్ది రోజుల క్రితం చెన్నైలోని కావేరి ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ ఆమె పరిస్థితి విషమించడంతో శుక్రవారం మధ్యాహ్నం 1:59 గంటలకు కన్నుమూసినట్లు వైద్యులు వెల్లడించారు. ఆమె మరణవార్తతో తెలుగు, తమిళ, కన్నడ సినీ పరిశ్రమల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. కేవలం నాయికగానే కాకుండా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా, ప్రతినాయక ఛాయలున్న పాత్రల్లోనూ వైవిధ్యం చాటుకుని తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. కళారంగానికి ఆమె అందించిన అమూల్యమైన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2022 సంవత్సరంలో దేశ అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటైన ప్రతిష్టాత్మక 'పద్మశ్రీ' అవార్డుతో ఆమెను ఘనంగా సత్కరించింది. ఆమె మృతి పట్ల పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ సోషల్ మీడియా వేదికగా నివాళులు అర్పిస్తున్నారు.

# షావుకారు జానకి మృతికి ప్రముఖుల సంతాపం

## చిరంజీవి, ఎన్టీఆర్, విజయ్‌ల సంతాపప్రకటన

**చెన్నై,ఆగస్ట్21 :** ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యల కారణంగా శుక్రవారం మధ్యాహ్నం కన్నుమూశారు. పలువురు సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా షావుకారు జానకికి నివాళులు అర్పించారు. ఆమె కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నారు. షావుకారు జానకి మరణంపై మెగాస్టార్ చిరంజీవి ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ' ప్రముఖ నటి, పద్మశ్రీ షావుకారు జానకి ఇకలేరనే వార్త ఎంతో బాధ కలిగించింది. 'షావుకారు' చిత్రంతో మొదలైన ఆమె సుదీర్ఘ సినీ ప్రస్థానం తెలుగు, తమిళంతో పాటు పలు భాషల్లో దాదాపు ఏడు దశాబ్దాలపాటు కొనసాగింది. వైవిధ్యమైన పాత్రలకు తన సహజమైన నటనతో ప్రాణం పోసి, ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానాన్ని సంపాదించుకున్న గొప్ప నటి ఆమె. భారతీయ చిత్ర పరిశ్రమకు ఆమె అందించిన సేవలు చిరస్మరణీయం. షావుకారు జానకి గారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ.. వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను' అని అన్నారు. జూనియర్ ఎన్టీఆర్ స్పందిస్తూ.. 'తెలుగు, భారతీయ సినీ రంగంలో తనదైన ముద్ర వేసిన షావుకారు జానకి మరణవార్త ఎంతో బాధ కలిగించింది. జానకి సినీ ప్రయాణం, ఆమె పోషించిన పాత్రలు ఎప్పటికీ మన జ్ఞాపకాల్లో నిలిచిపోతాయి. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ.. కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి' అని పేర్కొన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ స్పందిస్తూ.. 'తన అద్వితీయమైన నటనతో ఎన్నో తరాల ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి అనారోగ్యంతో కన్నుమూశారనే వార్త నన్ను తీవ్ర దిగ్భ్రాం÷-రతికి, వేదనకు గురిచేసింది. చిత్ర పరిశ్రమలో 70 ఏళ్లకు పైగా ప్రయాణించి, లెక్కలేనన్ని పాత్రలకు జీవం పోసిన ఆమె కళా సేవ ఎల్లప్పుడూ కొనియాడదగినది. తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ వంటి వివిధ భాషా చిత్రాలలో నటించి రికార్డు సృష్టించడంతో పాటు.. పద్మశ్రీ, కలైమామణి, నంది అవార్డులతో సహా పలు పురస్కారాలను అందుకున్న షావుకారు జానకి మరణం





సినీ రంగానికి తీరని లోటు' అని అన్నారు. మా అసోసియేషన్ అధ్యక్షుడు మంచు విష్ణు స్పందిస్తూ.. 'లెజెండరీ నటి షావుకారు జానకి మరణం నన్ను తీవ్రంగా కలచివేసింది. ఆమె హుందాతనం, గౌరవం, అద్భుతమైన నటనా ప్రస్థానం తరతరాలకూ నిలిచి ఉంటాయి. నేటి యువత ఆమె ఎంతటి గొప్ప మహోన్నతమైన వ్యక్తో తప్పకుండా తెలుసుకోవాలి. ఆమె కుటుంబసభ్యులకు నా హృదయపూర్వక సానుభూతి తెలియజేస్తున్నాను. ఓం శాంతి' అని రాసుకొచ్చారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**